9440662699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015

రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 3 సంచిక 10, పేజీలు 4 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక నవంబర్, సోమవారం 27- డిసెంబర్,ఆదివారం 3-2017

నాలుగో సింహం వ్యాధి

రాష్ట్రపతి నుంచి ముఖ్యమంత్రులు ,అధికారుల వరకు వారు ఏసమయంలో వచ్చినా భద్రత చూసుకోవాల్సింది పోలీసులే. ఉగ్రవాదులు, మావోయిస్టులు, మతకలహాలు, పండుగల సమయాల్లో బందోబస్తులు దోపిడీలు,దొంగతనం,ఇరుగుపొరుగువారి గొడవలు, అన్నదమ్ముల ఘర్షణలు, భార్యాభర్తల కొట్లాటలు అన్నింటికీ ఫిర్యాదు చేసేది పోలీసులకే.. వేళాపాళా, పనిగంటలు లేని ఉద్యోగం వారిది.

- రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి

ప్రజల్లో పోలీసులపై సానుభూతి ఉండదు సరికదా వాళ్లు అమాయకులను బాధిస్తారని, డబ్బులు తీసుకొని కేసులు నీరుకారుస్తారని, పనిచేయరని, ఖాకీబట్టలతో దోచుకుతింటారని చాలా అపోహలు ఉన్నాయి. సమాజంలో అందరూ మంచివాళ్లు ఉండనట్లే పోలీసుల్లో కూడా మంచివాళ్లు, చెడ్డవాళ్లు ఉంటారు వారందరినీ ఒకే గాటన కట్టడం సరికాదు. వాళ్ల సమస్యలను ప్రజలు, ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. దీనిలో భాగంగా కనీస సదుపాయాలులేని అమరావతిలో పోలీసుల ఎదుర్కొంటున్న సమస్యలను మీ ముందుంచుతున్నాం. తుళ్లూరు ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించిన తర్వాత రాకపోకలు పెరిగాయి. మరీ ముఖ్యంగా సచివాలయాన్ని తరలించడంతో ఈ కుగ్రామాల్లో భారీగా ట్రాఫిక్ పెరిగింది. దీంతోపాటు ముఖ్యమంత్రి అధికార నివాసం ఇక్కడే ఉండటంతో కంటికి కునుకు లేకుండా పటిష్ట బందోబస్తు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమాలు అనేక సార్లు ఆలస్యం అయినప్పటికీ రోడ్డుపై గంటలతరబడి నిలబడి ట్రాఫిక్‌ను కంట్రోలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి రాత్రి 11 గంటలవరకు అనేక సమీక్షా సమావేశాలు జరుపుతుంటారు. అప్పటివరకు భద్రతలో ఉన్న పోలీసులు ఇంటికి చేరుకునే సరికి అర్ధరాత్రి దాటుతోంది. మళ్లీ తెల్లవారే ఇంటినుంచి రావాల్సి వస్తుండటంతో నిద్రచాలక, ఆరోగ్యం దెబ్బతింటోంది. పగలంతా కరకట్ట, సచివాలయం ప్రాంతాల్లో డ్యూటీలు చేస్తున్నవారికి కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా సదుపాయాలు లేవు. ఇక్కడే టెంటుల్లో పహారా కాస్తున పోలీసుల పరిస్థితి మహాదారుణంగా ఉంది. రాత్రిపూట ఏ పాముపై కాలు వేస్తారో తెలియదు, చలి, పైఅధికారులు, రాజకీయవేత్తల నుంచి ఒత్తిడి దీంతో చిన్నవయస్సులోనే బీపీ, షుగర్ల బారిన పడుతున్నారు. అడ్వాన్సులు, హెచ్ఆర్ఏ విషయంలో కూడా వీరికి న్యాయం జరగడం లేదు. ఇదివరలో అందచేసిన ఫీడింగ్ అలవెన్స్‌ను అందచేయకుండా ప్రభుత్వం వీరిని అలక్ష్యం చేస్తోంది. సచివాలయ ఉద్యోగులకు 30 శాతం హెచ్ఆర్ఏ ఇస్తుంటే పోలీసులకు మాత్రం 12 శాతమే కేటాయించారు. దీంతో పని గంటలు ఎక్కువ,జీతాలు తక్కువ అనే మానసిక క్రుంగుబాటుకు గురవుతున్నారు. రాజధాని ప్రాంతంలోని ఇసుక రీచ్‌ల్లో పనిచేసే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అక్కడి నుంచి 5 నిమిషాలు కదిలినా లెక్కలు తారుమారవుతాయి. అక్కడ హోటళ్లు కూడా లేకపోవడంతో భోజన సదుపాయం లేదు. ఈ ప్రాంత రైతులు తమ ఆవులు,గేదెలు, మేకలను రాత్రిపూట పొలాల్లోకి వదులుతారు. మంత్రుల సచివాలయంలో పనులు ముగించుకొని రాత్రి సమయంలో వెళుతున్నప్పుడు వాటిని రోడ్లపైకి రాకుండా చూసే బాధ్యత పోలీసులదే.. చదువుతుంటే నవ్వు వస్తుందేమో కాని కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు రోజువారీ ఎదుర్కొంటున్న సమస్యలు ఇవి.

పోలీసు వ్యవస్థల్లో సంస్కరణలు ప్రవేశపెట్టి పనిగంటలు నియంత్రించాలని, వారానికి ఒకరోజు సెలవు మంజూరు చేయాలని అనేక కమిటీలు సూచించినప్పటికీ అవి కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయి.

రాష్ట్రంలో జపాన్ టమోటాల ఉత్పత్తి

రాజధాని వార్తలు ప్రతినిధి- విశాఖపట్నం : జపాన్ టమోటాలు ఇకపై ఆంధ్రప్రదేశ్‌లో పండించబోతున్నారు. ఇందుకోసం జపాన్ సంస్థ కాంగోమ్‌తో ప్రభుత్వ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. కూరగాయలను పండించడంలో కాంగోమ్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది.టమోటాల్లోని 7,500 రకాలను ఈ సంస్థ అభివృద్ధి చేసింది. ఇంట్లో పెంచుకునే మొక్కలను కూడా రూపొందించి జపాన్‌తోపాటు మిగతా ప్రపంచదేశాల్లో జెనటిక్ సమాచారాన్ని అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 'మిషన్ హార్టికల్చర్ 'పేరుతో 2 కోట్ల ఎకరాల్లో ఈ సంస్థ ద్వారా పంటలను ఉత్పత్తి చేయబోతోంది. వీటి మార్కెటింగ్‌కూడా ఆ సంస్థే చేపడుతుందని వెల్లడించారు. పర్యావరణకు హానిచేయని క్రిమిసంహారక మందులను, రసాయనాలను ఉపయోగించని సేద్యాన్ని వారు విస్తరిస్తారు. వర్షపునీరు, పోషకపదార్థాలు, మొక్కల అవశేషాలను మళ్లీ వినియోగించడం ద్వారా ఈ సంస్థ పంట దిగిబడులను పెంచుతుంది. పైలెట్ ప్రాజెక్టుగా హెక్టారులో టమోటా సాగును చేపట్టనున్నారని రాష్ట్ర హార్టీ కల్చర్ కమిషనర్ చిరంజీవి చౌదరి తెలిపారు. సాంప్రదాయక పంటల నుంచి ఉద్యానవన పంటలకు (పళ్లు, కూరగాయలు, పుష్పాలు) రైతులను మళ్లించడం ద్వారా గణనీయమైన ఆదాయాన్ని పొందడం సాధ్యమవుతుందన్నారు. సాంకేతికతను వినియోగించి,రైతులకు మార్కెట్లపై అవగాహన పెంచి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) ద్వారా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేసి రైతులకు ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఏజెన్సీలో ఆపిల్ సాగు

తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి మండలంలో కుందాడలోఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న బచ్చెల లక్ష్మి పొలంలో ఐటీడీఏ సహకారంతో ఆపిల్ మొక్కలను నాటారు. ఇంతకుముందు ఆమె దినసరి కూలీగా ఉండేది. ఐటీడీఏ , ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఆర్ఐసీఓఆర్), హార్టికల్చర్ శాఖలు సంయుక్తంగా చేపట్టిన చర్యల్లో భాగంగా లక్ష్మి ,మరో 9 మంది పొలాల్లో ఈ మొక్కలను నాటారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాల్లో వాతావరణం యాపిల్‌సాగుకు అనువుగా ఉంటుందని,అందువల్ల పైలెట్ ప్రాజెక్టుగా ఇక్కడ సాగుచేస్తున్నామని

- మిగతా 2 లో

28న విట్‌లో నూతన భవన ప్రారంభోత్సవం



రాజధానివార్తలు ప్రతినిధి, ఐనవోలు : విట్ విద్యాసంస్థలో సర్వేపల్లి రాధాకృష్ణన్ భవన సముదాయం (5 అంతస్తులు), సరోజినీ నాయుడు హాస్టల్ సముదాయం (9 అంతస్తులు) లను 28 ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసన సభాధ్యక్షులు కోడెల శివప్రసాద్‌రావు, ఎంపీ గల్లాజయదేవ్, మంత్రులు నారా లోకేష్, సిహెచ్ అయ్యన్నపాత్రుడు,గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, నన్నపనేని రాజకుమారి, ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, ముఖ్యకార్యదర్శి అజయ్ జేన్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి విద్యా ఆదిత్యనాథ్, గుంటూరు జిల్లా కలెక్టర్ కె.శశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ సీహెచ్ శ్రీధర్ అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీపార్థసారథి పాల్గొనున్నారు. విట్ ఛాన్సలర్ జి. విశ్వనాథ్, విట్ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథ్, శేఖర్ విశ్వనాథ్, జి.వి. సెల్వం, డాక్టర్ డి.సుభాకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంధ్యా పెంటరెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్ విశ్వనాథన్, అడ్వైజర్ డా. విరాజు, రిజిస్ట్రార్ డా. సీఎల్‌వీ శివకుమార్ ఈ కార్యక్రమంలో పొ.విద్యా ఆదిత్యనాథ్, ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కళాశాలలో 2017-18 సంవత్సరంలో విద్యార్థులకు

- మిగతా 2 లో

ఆర్ అండ్ బీ భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రౌండ్‌ఫ్లోర్ ఏపీపీఎస్సీ, మొదటి అంతస్తు ఐటీ విభాగం, రెండో అంతస్తు హెచ్ఓడీల విభాగం, 3 నుంచి 5 అంతస్తులు ఆర్ అండ్‌బిశాఖలు ఈ భవనంలో నెలకొల్పారు.

అధికారంలోకి వస్తే.. గుడి, చర్చి, మసీదులకు రూ. 15 వేలు

కర్నూలు: ప్రజాసంకల్ప యాత్ర పేరుతో వైసీపీ అధినేత జగన్ చేపట్టిన పాదయాత్ర జిల్లాలోని తొగడచేడుకు చేరుకుంది. పాదయాత్రలో భాగంగా ముస్లింలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని గుడి, చర్చి, మసీదులకు రూ.15 వేలు ఇస్తామని జగన్ ప్రకటించారు.

దక్షిణ కోస్తాకు వర్ష సూచన

విశాఖపట్నం : ప్రస్తుతం మధ్య బంగాళాఖాతం మీదుగా అల్పపీడనం కొనసాగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణ మధ్య బంగాళాఖాతం, హిందూ మహాసముద్రాలను కలుపుకొని, సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసి ఉందని తెలిపింది. ఇవి నైరుతీ దిశగా కదులుతుందని వెల్లడించింది. తమిళనాడు, శ్రీలంక దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందని పలు అంతర్జాతీయ వాతావరణ వెబ్‌సైట్‌లు అంచనా వేస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో దక్షిణ కోస్తాలో నేటి నుంచి వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.28 నుంచి రాయలసీమ మీదా ఈ ప్రభావం ఉంటుందని వెల్లడించింది.

సుందర భాగ్యనగరం

హైదరాబాద్ : ఇవాంక రాక పుణ్యమా అని హైదరాబాద్ సుందరంగా రూపొందింది. గతుకుల రోడ్లన్నీ హైదరాబాద్ మున్సిపాలిటీ యుద్ధప్రాతిపదికన బాగుచేసింది. మరీముఖ్యంగా ఇవాంక ట్రంప్, ప్రధాని మోడీ పర్యటించే ప్రాంతాలన్నీ అత్యంత అందంగా తీర్చిదిద్దారు. గోడలు, ఫ్లైవోర్‌పైనా పెయింటింగులు వేశారు.సదస్సు జరిగే ప్రాంగణం పరిసర ప్రాంతాలు సహా వెస్ట్‌జోన్, సెంట్రల్ జోన్‌లోని పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, హోటళ్లకు వెళ్లే మార్గాలను జీహెచ్ఎంసీ అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. సుమారు రూ.45కోట్ల అంచనా వ్యయంతో 100కుపైగా రోడ్లు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, సుందరీకరణ, లైటింగ్, రోడ్‌మార్కింగ్, సైన్‌బోర్డుల ఏర్పాటు చేపట్టారు. బంజారాహిల్స్, హైటెక్‌సిటీ అత్యాధునిక మిల్లింగ్ టెక్నాలజీతో రోడ్లను బాగుచేశారు. బంజారాహిల్స్‌తోపాటు సదస్సు జరిగే ప్రాంగణం పరిసరాల్లో అంధులు సునాయాసంగా నడుచుకుంటూ వెళ్లేలా వారికి అనుకూలమైన టైల్స్‌ను ఫుట్‌పాత్‌లపై ఏర్పాటుచేశారు.

నగరవాసులకు ట్రాఫిక్ కడగళ్లు

హైదరాబాద్ నగరంలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే గ్లోబల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (జీఈఎస్)కోసం నగరాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించి, స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. అత్యవసర పనులుంటే తప్ప బయటికి ఎవరూ రావద్దని పోలీసులు ఆదేశిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా 1600 మంది హాజరుకానున్నారు. ఈ మూడురోజులు గోల్కొండకు

- మిగతా 2 లో

ఇవాంకా ట్రంప్‌కు ఖరీదైన గిఫ్ట్‌బాక్స్

నగరంలో మూడ్రోజులపాటు జరిగే గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌కు హాజరయ్యే ఇవాంక ట్రంప్‌కు తెలంగాణముఖ్యమంత్రి ఖరీదైన గిఫ్ట్ బాక్స్‌ను అందచేయనున్నారు. దానిలో గద్వాల, సిరిసిల్లా చేనేత పట్టు చీరలు, ముత్యాలు పొదిగిన నెక్లెస్, హైదరాబాదు డిజైనర్లు తయారు చేసిన కట్‌డైమండ్ నగలు, వెండి చార్మినార్‌లను గోల్కొండ ఆతిథ్యం తర్వాత బహుమతిగా ఇవ్వనున్నారు. అయితే ఈ బాక్సును అందచేయడానికి కేసీఆర్ అమెరికా భద్రతాదళాల అనుమతిని కోరుతున్నారు. మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్‌రాజశేఖర్ రెడ్డిలు వెండి చార్మినార్‌ను మాత్రమే రాష్ట్ర గుర్తుగా బహుమతిగా ఇచ్చేవారు.

మాస్టర్ ప్లాన్ మార్చాల్సిందే

రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) తీర్పుతో రాజధాని మాస్టర్ ప్లాన్ మార్చాల్సిందేనని రాజధాని ప్రాంత రైతు- రైతుకూలీ హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. రాజధానిలో ఎన్జీటీ తీర్పు ప్రకారం 20వేల ఎకరాల్లో నిర్మాణాలు జరపకూడదని తెలిపింది. స్విస్ ఛాలెంజ్ ఒప్పందం పేరుతో సింగపూర్ కంపెనీలకు కట్టబెట్టిన 1691 ఎకరాలు కూడా ఫ్లడ్ ప్లెయిన్స్ కిందే వస్తాయని, అందువల్ల అక్కడ ఎలాంటి నిర్మాణాలు చెయ్యకూడదనంటూ ఈ తీర్పు వల్ల రాజధానిలోని రైతులకు, రైతు కూలీలకు కొంత ఉపశమనం లభించిందని సమితి తెలిపింది. తాము రాజధానికి వ్యతిరేకం కాదని, రాజధాని పేరుతో ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గానికి వ్యతిరేకమని సమితి నేతలు స్పష్టం చేశారు. రైతులకు, రైతు కూలీలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు విజయవాడలో సుప్రీం కోర్టు మాజీ జడ్జి గోపాల్ గౌడ్ విజయవాడలో ఆదివారం చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి తెలిపింది. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు, నిర్వాసితులు అందరూ పాల్గొనాలని రైతు-రైతుకూలీ హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్ అనుమోలు గాంధీ పిలుపునిచ్చారు.

రాజధాని వార్తలు
కలం

నిర్వేదంలో రాష్ట్ర ప్రజలు

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు వెలువరించి వారం దాటింది. అధికారపార్టీ పిటీషనర్లు తాము గెలిచామంటే తాము గెలిచామని చెప్పడమేకాని ప్రజలు మాత్రం ఏమీ పట్టనట్టుగా ఉండిపోయారు. ఈ నిర్వేదం ఇప్పటిది కాదు.. ఆంధ్రప్రదేశ్‌ను అప్పటికప్పుడు అర్థాంతరంగా, అమానుషంగా విభజించినప్పటి నుంచి ఇదే మౌనాన్ని ఇక్కడి ప్రజలు పాటిస్తున్నారు. చట్టప్రకారం పంటభూముల్లో నిర్మాణాలు జరపకూడదు, అయితే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దాన్ని విస్మరించి మూడుపంటలు పండే భూములను సర్కారు రాజధానికి ఎంచుకుంది. చిత్తడి నేలలు కావడంతో బహుళ అంతస్తుల నిర్మాణాలకు పనికిరాదన్నారు. అయినా అదే భూముల్లో నిర్మాణాలు జరిపారు,అవి నిపుణుల అంచనాల మేరకు వాటి దుష్ఫలితాలను కూడా చూపుతున్నాయి. ఉదాహరణకు ఒక వర్షం రాగానే రూ. 1000కోట్లతో నిర్మించిన తాత్కాలిక భవనాలు కారిపోవడం గట్టి వర్షం వస్తే ఆ ప్రాంతం అంతా మునిగిపోవడం లాంటివి చూస్తూనే ఉన్నాం. ఇదంతా ఏడాదికి మూడు పంటల్లో 120 రకాల వ్యవసాయ ఉత్పత్తి చేసే ప్రాంతమని పిటిషనర్లు కోర్టుకు విన్నవిస్తే, ప్రభుత్వం దాన్ని బంజరు భూమిగా కోర్టుకు నివేదించింది. అయితే కోర్టు క్షేత్రస్థాయిలో భౌతికంగా పరిశీలించకుండా ఆ విషయంలో ప్రభుత్వాన్నే అనుసరించింది. నిజానికి రాజధాని నిర్మాణ ప్రారంభోత్సవానికి ప్రధాని, సుప్రీంకోర్టు జడ్జిలు కూడా వచ్చారు. అంటే ఉద్దేశపూర్వకంగా పెద్దలంతా కలసి చట్ట ఉల్లంఘనకు పాల్పడినట్టే భావించవచ్చు. అలాగే నిర్మాణాలను ఆపివేయాలని ఎన్‌జీటీ ఆదేశించింది. ప్రభుత్వం దాన్ని పట్టించుకోకుండా నిర్మాణాలను జరుపుకుంటూ వెళ్లింది. అంటే కోర్టు ఉల్లంఘనకు పాల్పడింది. దీనిపై కూడా కోర్టు చర్యలు తీసుకోలేదు. సామాన్యుడిపై కోర్టులు చట్టాలు పనిచేస్తాయి కాని ప్రభుత్వాల మీద కాదని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. అలా అని ఎన్జీటీ తన బాధ్యతలను విస్మరించలేదు. పర్యావరణానికి పెద్దపీట వేసింది. అందుకోసం రెండు కమిటీలను ఏర్పాటు చేసింది. ఒకటి రాజధాని అమరావతి పర్యావరణ పర్యవేక్షణ కమిటీ కాగ, రెండవది పర్యావరణ అమలు కమిటి. పర్యావరణ పర్యవేక్షణ కమిటీలో ఆరుగురు సభ్యులను నియమించింది. కేంద్ర పర్యావరణ,అటవీ-వాతావరణ మార్పుల పరిశీలన మంత్రిత్వశాఖ,అదనపు కార్యదర్శి ఈ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ అదనపు ప్రధాన కార్యదర్శి దీనిలో సభ్యుడిగా,నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ ఉత్తరాఖండ్ డైరెక్టర్ ఒక సీనియర్ శాస్త్రవేత్తను, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బెంగళూరుకు చెందిన మరో శాస్త్రవేత్త, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నిరోధక శాఖ కార్యదర్శి, సావిత్రిబాయ్ ఫూలే, పూనే వర్సిటీనుంచి భూగర్భ శాస్త్రవేత్తలను ఈ కమిటీలో ఉన్నారు. పర్యావరణ అమలు కమిటీలో రాష్ట్ర పర్యావరణ శాఖ అదనపు కార్యదర్శి దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. పర్యావరణ, అటవీ,వాతావరణ మార్పుల శాఖ నుంచి నామినీ అయిన వ్యక్తి సభ్యుడిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర కాలుష్యనివారణ శాఖ కార్యదర్శి, బెంగళూరు ఐఐఎస్ నుంచి భారత ప్రభుత్వం సూచించిన శాస్త్రవేత్త, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ మైక్రో బయాలజీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్. కడియాల వెంకటేశ్వరరావులతో ఉన్నారు.

అమరావతి నిర్మాణంలో ఎటువంటి పర్యావరణ ఉల్లంఘనలు జరపకుండా ఎన్‌జీటీ పకడ్బంధీగా ఏర్పాట్లుచేసిన మాట వాస్తవం. అడుగడుగునా కోర్టు తీర్పులను ధిక్కరించే ప్రభుత్వాలు ఎంతవరకు కోర్టుల ఆదేశాలను అమలు చేస్తారన్నదే ప్రస్తుత ప్రశ్న. ఇదే ప్రజలను నిర్వేదంలో ముంచుతోంది.

మన కోసం

శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్	తుళ్ళూరు	చందోలు సత్యనారాయణ	9441411432
రెస్టారెంట్స్			
బిర్యానిస్	విజయవాడ	బిర్యానిస్	7032202222
స్వాగత్ మెస్(వెజ్)	మల్కాపురం	చిగురుపాటి	90329 58580
ఎస్.ఆర్.కె. గ్రాండ్	మందడం	శ్రీనివాస్	9553023388
షాప్స్			
రేమాండ్స్‌టైలర్స్	తుళ్ళూరు	ఎస్.కె. జాని	9492470426
వర్షిత ఫోటోస్టాట్	రాయపూడి	పోతురాజు	9985853188
బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్	రాయపూడి	షేక్. మజీదు	7095880828
కె.జి .ఎన్. కారు ట్రావెల్స్	రాయపూడి	ఎస్.కె.సుబాని	97040 74820,
వైభవ్ డ్రెస్సెస్	తుళ్ళూరు	ఎస్వి. పున్నారావు	9848407935
చైతన్య గోదావరి బ్యాంకు	రాయపూడి		08645244266
ఉంగరాల హస్సేన్ టెంట్‌హౌస్	రాయపూడి	ఉంగరాలఖాజ	9441275466
అంజుమన్ టెంట్ హౌస్	రాయపూడి	పఠాన్ బాషా ఖాన్	9502085516
ట్రేడర్స్			
సాయి గణేష్	వెలగపూడి	జొన్నలగడ్డ మనోజ్ కుమార్	7382371111
శ్రీ చంద్రిక	రాయపూడి	కోలా శ్రీనివాసరావు	908073516

మ్యారేజీ లింగ్స్

షేక్ జానీ	విజయవాడ	9985394613

1 నుంచి 4 తేదీల్లో 'పెద్ద' సినిమా పండుగ

100 దేశాలకు భాగస్వామ్యం, 5000 మంది ఆహ్వానితులు,30వేల మంది సందర్శకులు, పరిశ్రమ వృద్ధిపైనే ఫోకస్, పెరగనున్న బ్రాండ్ వాల్యూ

ఏసియా వన్ గ్లోబల్ ఇండిన్ అవార్డు పురస్కారం అందుకుంటున్న సోహన్ రాయ్ (ఫైల్ ఫోటో)

హైదరాబాద్ : సినిమా రంగ వైభవాన్ని,దాని పరిధిని విస్తరిస్తూ అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న సినిమా 'పెద్ద' పండుగకు హైదరాబాద్ ఆహ్వానం పలుకుతోంది. 'ఇండీవుడ్‌ఫిల్మ్ కార్నివాల్-2017' పేరిట మూడవ విడత జరగబోతున్న ఈ ఉత్సవం డిసెంబర్ 1 నుంచి నాలుగు రోజుల పాటు రామోజీఫిల్మ్ సిటీలో తళుకులీనునుంది. గతేడాది 2వ విడత ఇక్కడే జరిగిన ఉత్సవాల స్ఫూర్తిగా 3వ విడత కార్నివాల్ మురిపించనుంది. ఈ ఉత్సవాలో 100 దేశాలకు చెందిన ఐదువేల మంది ఆహ్వానితులు, దేశవిదేశాలకు చెందిన మరో 30వేల మంది సందర్శకులు పాల్గొనబోతున్నారు. ప్రపంచ సినిమా రంగ వైభవానికి అద్దం పట్టే విధంగా ఆయా దేశాలకు చెందిన చిత్ర ప్రదర్శనలు, ఫిల్మ్ మార్కెట్‌పై చర్చలు, సమావేశాలు, జరగనున్నాయి. దీంతో పాటు సినిమా అవార్డులు, ప్రతిభా అన్వేషణలు, ప్రదర్శనలు, సంగీత విభావరులు వీక్షకులను అలరించనున్నాయి. ఫిల్మ్ టూరిజంపై సదస్సులు, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలు, బ్రాండ్‌షోలు,వ్యాపార ఒడంబడికలు ఇత్యాది కార్యక్రమాలకు ఇండీవుడ్ వేదిక కానుంది.

ప్రపంచవ్యాప్తంగా సినిమా పరిశ్రమలో వస్తున్న మార్పులు, సాంకేతికంగా చోటు చేసుకుంటున్న అభివృద్ధి, అత్యాధునిక విధానాలకు ఈ వేడుక దర్పణం పట్టనుంది.రాష్ట్రంలో రెండవసారి జరుగుతున్న ఈ కార్నివాల్‌కు తెలంగాణా ప్రభుత్వం తన సంపూర్ణ సహకారం అందచేస్తోంది. అంతర్జాతీయ చిత్ర పరిశ్రమకు భారత్‌ను ఒక ప్రవేశద్వారంగా తీర్చిదిద్దడం, దేశీయంగా సినిమా తెరలను పెంచడం, దేశీయ చిత్రాలకు అంతర్జాతీయంగా మార్కెట్ కల్పించడం, వివిధ భాషలకు చెందిన భారత చలన చిత్ర పరిశ్రమను ఒకతాటిపైకి తీసుకురావడం ప్రధాన లక్ష్యాలుగా ఇండీవుడ్ నిర్వహిస్తున్నారు. సాంకేతిక నిపుణులు,సామాగ్రి తయారీ సంస్థలు, మల్టీప్లెక్స్ థియేటర్లు,యానిమేషన్,విఎఫ్ఎక్స్,స్టూడియా అధినేతలు, ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లు ప్రతినిధులు కూడా పెద్దఎత్తున పాల్గొనబోతున్నారు. అలాగే ప్రకటన, టీవీ, మొబైల్ రంగాలపై కూడా ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో భారత చలనచిత్ర పరిశ్రమ పరిమాణం 10బిలియన్ డాలర్లకు చేరుకునేందుకు ఈ కార్నివాల్ దోహదం చేస్తుందని భావిస్తున్నారు. వివిధ భాషలకు చెందిన పలువురు సినీతారలు ఈ ఉత్సవానికి బ్రాండ్ అంబాసిడర్లుగా, పలు ప్రఖ్యాతి చెందిన వాణిజ్య సంస్థలు తమ సౌజన్యాన్ని అందిస్తున్నాయి. కార్నివల్ నిర్వహణ కోసం రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రత్యేక కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఫిల్మ్ జర్నలిజాన్ని ప్రోత్సహించేందుకు, ఉత్సవ వార్తల ఉత్తమ కవరేజ్‌కు సంబంధించి మీడియాకు లక్ష రూపాయల విలువైన బహుమతులతో పాటు, ట్రోఫీ, ప్రశంశాపత్రాలను అందచేయనున్నారు. నవంబరు నెలాఖరులో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు ముగిసిన వెంటనే మరో అంతర్జాతీయ వేడుకకు హైదరాబాద్ ఆహ్వానం పలకడం విశేషం. ఇండీవుడ్ కార్నివాల్‌కు వ్యవస్థాపక సంచాలకునిగా కేరళకు ప్రవాసభారతీయుడు, ఏరీస్ గ్రూప్ చైర్మన్,సిఇవో సోహాన్‌రాయ్ వ్యవహరిస్తున్నారు.

- మనోహర్

శ్రీనగర్‌లో హిమపాతం

శ్రీనగర్ : శ్రీనగర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ దశాబ్దపు నవంబరుల్లో గురువారం అత్యంత చలి రాత్రిగా నమోదైంది. గతవారం శ్రీనగర్‌లో మైనస్ 3.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, అది 0.8 డిగ్రీలకు పడిపోయిందని వాతావరణ శాఖ తెలిపింది. 5 రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయని, 2007 నవంబరు 28న మైనస్ 4.8 డిగ్రీల సెల్సియస్ నమోదైందన్నారు. 4 రోజుల నుంచి లడఖ్ ప్రాంతంలో ఉష్ణోగ్రత తగ్గుదలతోపాటు తీవ్ర చలిగాలు వీస్తున్నాయని వివరించారు. ఉత్తర కాశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో మైనస్ 6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అమర్‌నాథ్ యాత్రకు బేస్ పాయింట్ అయిన ఫహాల్గం అత్యంత చలిగల రెండో ప్రదేశంగా రికార్డయింది. ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారాలో మైనస్ 2.2 డిగ్రీల సెల్సియస్, కార్గిల్‌లో 2 రోజుల నుంచి మైనస్ 9 డిగ్రీల సెల్సియస్, కార్గిల్‌లో 2 రోజుల నుంచి మైనస్ 9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. శుక్ర, శనివారాల్లో కాశ్మీర్‌లో స్వల్ప వర్షంకాని లేదా హిమపాతం గాని ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మందడంలో తొలి వర్చువల్ క్లాస్ రూమ్

రాజధాని వార్తలు ప్రతినిధి, మందడం : మందడం జిల్లా పరిషత్ పాఠశాలలో వర్చువల్ క్లాస్ రూమ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యను అలవర్చుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలకు 15 ఎంబీపీఎస్ హై స్పీడు ఫైబర్ నెట్ కనెక్షన్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపీపీ పద్మలత, అధికారులు, స్థానిక నాయకులు ముప్పవరపు కృష్ణారావు, నరేంద్రబాబు, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

27న 'అమరావతి డిక్లరేషన్'

శాసన సభ. సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు

రాజధాని వార్తలు ప్రతినిధి, గుంటూరు : సమాజంలోని మహిళల్లో మనో ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కలిగించేందుకు పుస్తకంగా రూపొందించిన అమరావతి డిక్లరేషన్‌ను ఈ నెల 27న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేస్తారని రాష్ట్ర శాసన సభ, సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మహిళా సాధికారితపై మాట్లాడారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 10,11,12, తేదీలలో విజయవాడలోని పవిత్ర సంగమం వద్ద జరిగిన 'మహిళా పార్లమెంటేరియన్ సదస్సు'లో తీసుకున్న నిర్ణయాలనుప్రపంచ వ్యాప్తంగా మహిళలందరికీ తెలియాలనే ఆలోచనతో ఒక పుస్తక రూపంలో తయారు చేసినట్లు తెలిపారు. వివిధ దేశాలకు చెందిన మహిళా సభాపతులు, వివిధ రంగాలకు చెందిన మహిళా పారిశ్రామిక వేత్తలు, విద్యార్థినులు మొత్తం 25 వేల మంది పాల్గొన్న ఆ సదస్సులో మహిళా సాధికారతపై తమ అమూల్యమైన సలహాలను, సూచనలను ఇచ్చారని, వాటన్నింటినీ క్రోడీకరించి పుస్తకాన్ని తీసుకు వస్తున్నట్లు చెప్పారు. 27న సాయంత్రం 4 గంటలకు విజయ వాడలోని సిదార్థ గార్డెన్స్‌లో మహిళా సాధికారిత ప్రకటన విడుదల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు బాల కార్మికుల, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న కైలాష్ సత్యార్థి, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షురాలు అరుంధతీ భట్టాచార్య, అడయార్ కాన్సర్ సంస్థ ప్రతినిధి డాక్టర్ శాంతి, కేంద్ర మంత్రి ఓ.ఎస్.చౌదరి, ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, చెస్ క్రీడా కారిణి కోనేరు హంపి, ఫార్మా రంగంలోని మహిళా పారిశ్రామిక వేత్త మహిమ దాట్ల, వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొంటారని స్పీకర్ తెలిపారు.

పూర్తిస్థాయి డీజీపీగాసాంబశివరావు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ పూర్తి స్థాయి డీజీపీగా నండూరి సాంబశివరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం సమన్వయ విభాగం డీజీపీ పోస్టులో కొనసాగుతున్న ఆయనను డీజీపీ (పోలీసుల దళాల అధిపతి)గా బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2016 జులై 23న ప్రభుత్వం సాంబశివరావును ఇన్‌చార్జీ డీజీపీగా నియమించింది. అప్పటినుంచి ఆయన ఆ హోదాలోనే పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డిసెంబరు నెలాఖరుకు ఆయన పదవీ విమరణ చేయనున్న నేపథ్యంలో ఆయన్నే పూర్తిస్థాయి డీజీపీగా నియమించాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక ప్రక్రియ నిర్వహణ కోసం ఏడుగురు అధికారుల పేర్లతో కేంద్రానికి జాబితా పంపించడం, వారు దాన్ని తిరస్కరించి కొత్తది పంపించనున్న సంగతి విదితమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జాబితాపైన ఏకాభిప్రాయం రాకపోవడంతో ఈ నెల 22న జరగాల్సిన ఎంపిక కమిటీ సమావేశం కూడా వాయిదా పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటివరకూ ఇన్‌ఛార్జీ డీజీపీగా ఉన్న సాంబశివరావును పూర్తిస్థాయి డీజీపీగా నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సుందర భాగ్యనగరం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరినీ అనుమతించడంలేదు. మాదాపూర్, హైటెక్‌సిటీ ప్రాంతాలన్నీ పోలీసుల మయంగా ఉంది. అర్ధరాత్రికల్లా బార్లు బంద్ చేయాలని హుకుం జారీ చేశారు. బేగంపేట విమానాశ్రయంలో ఇవాంక ట్రంప్ , ప్రధానిమోడీ బేగంపేట విమానాశ్రయంలో దిగనున్నారు.

ఇవాంకే ప్రధాన ఆకర్షణ

ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు (జీఈఎస్)లో ప్రధాన ఆకర్షణగా ఇవాంక ట్రంప్ నిలవనున్నారు. ఆమెకు కల్పించే భద్రతతో సహా ఆమె ఏ వస్త్రాలు ధరిస్తారు, ఎలాంటి ఆహారాన్ని స్వీకరిస్తారు తదితరాలన్నీ చర్చనీయాంశంగా మారాయి. ఐదంచెల భద్రతను ఇవాంకకు కల్పిస్తున్నారు. ఇందులో మొదటి రెండు అంచెల్లో అమెరికా సీక్రెట్ ఏజెంట్లు ఎఫ్‌బీఐ అధికారులు ఉంటారు. మూడు. నాలుగు అంచెల్లో ఎస్‌పీజీ, కేంద్ర నిఘా వర్గాలు ఉంటాయి. ఐదవ అంచెల్లో స్థానిక పోలీసులు ఉంటారు. కేవలం ఇవాంక భద్రత కోసం 36 మంది ఉన్నతధికారులు అమెరికా నుండి తరలివచ్చారు. ఇందులో 18 మంది అధికారులు సీక్రెట్ సర్వీసుకు చెందినవారు మరో 18 మంది ఎఫ్‌బీఐకి చెందిన అధికారులు. వీరేగాక మరో 48 మంది మనదేశానికి చెందిన ఆక్టోపస్ గ్రేహౌండ్స్ దళాలు ఆమెకు రక్షణగా నిలుస్తాయి. ఇవాంక భద్రత కోసం ప్రత్యేక ఉపగ్రహంతో అమెరికా ప్రభుత్వం నిఘా ఏర్పాట్లు చేసింది. హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో సీక్రెట్ ఏజెంట్లు భద్రతా అధికారులు పనిచేస్తారు. ఆమె కాన్వాయ్‌లో 24 నుండి 28 వాహనాలు ఉండే అవకాశముంది. అమెరికా నుండి ప్రత్యేక విమానంలో 28 తెల్లవారు జామున బేగంపేట విమానాశ్రయంలో దిగనున్నారు. ఈ విమానంలోనే మూడు మైన్ రెసిస్టెంట్ వెహికిలో (ఎంఆర్‌వీ)లు వస్తున్నాయి. వీటిలో జామర్లు, ఇతర అత్యధునాతన పరికరాలు ఉంటాయి.

ఇవిగాక మరో అత్యధునాతన బుల్లెట్ ప్రూవ్ వాహనాలను ఇప్పటికే అమెరికా ప్రభుత్వం వేరువేరు విమానాల్లో హైదరాబాద్ పింపింది. ఇవాంక బద్రతా సిబ్బందికి 'మార్వెల్' అని పేరుపెట్టుకున్నారు. తొలుత ఇవాంక రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రావాలని భావించారు. ఐదు గంటల పాటు అన్ని రకాల విమానాలను ఆపాలని అమెరికా సీక్రెట్ సర్వీస్ లేఖ రాయగా, అది సాధ్యం కాదని భారత పౌరవిమానయాన శాఖ అధికారులు స్పష్టం చేశారు. దాంతో బేగంపేట విమానాశ్రయానికి ఆమె రాకను మార్చుకున్నారు. ఇక సదస్సులో పాల్గొనే సమయంలో ఇవాంక అమెరికాలో ధరించే రోజు వారి మోడ్రన్ డ్రెస్సులు ధరిస్తారా లేక భారతీయ సంప్రదాయ చీరలు ధరిస్తారా అనేది చర్చనీయాంశంగా ఉంది. స్వతహాగా ఫ్యాషన్ డిజైనర్ అయిన ఇవాంకకు 'స్టైల్' అనే బ్రాండ్ ఉంది. ఇటీవల జపాన్ పర్యటనలో అక్కడి సంప్రదాయ వస్త్రాలను ఆమె ధరించారు. అందువలన మన దేశ పర్యటనలో కూడా ఇక్కడి సంప్రదాయ వస్త్రాలను ధరించే అవకాశం ఉందని రాష్ట్ర సర్కార్ భావిస్తోంది. దాంతో ప్రత్యేకంగా ఒక పోచంపల్లి పట్టుచీరను ఆమె కోసం నేయించింది. ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చే విందులో ఆమె ఈ చీర ధరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఆమె ఆహారానికి సంబంధించి 30 రకాల వంటకాలను ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. అందులో హైదరాబాదీ బిర్యానీ, పత్తార్ కా గోష్, హలీమ్, మునగ్, షీ కబాబ్, మటన్ కోఫ్తా గ్రిల్డ్ మొగలాయి మటన్, చికెన్ డిషెస్, బగార బైగన్, కుబానీకా మీఠా, డ్రై ఫ్రూట్స్ ఖీర్‌లు ఉన్నాయి.

ఇవాంక మానియా

ఆమె ఏం తింటుంది ?ఎలాంటి డ్రస్ వేసుకుంటుంది ? ఎక్కడ పర్యటనలు జరుపుతారంటూ ? నాయకులు హడావుడి పడుతూ, ఆమె రాకకు నాయకులు అత్యంత ప్రచారం కల్పిస్తున్నారు. ప్రధాని 28 రాత్రి ఆమెకు పలక్‌నూమా ప్యాలెస్‌లో విందు నిస్తుండగా, తర్వాతి రోజు గోల్కొండ కోటలో తెలంగాణ ముఖ్యమంత్రి విందు ఇవ్వనున్నారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సుతో పారిశ్రామికవేత్తలకు ఎంత మేలు జరుగుతుందో తెలియదు కాని ఏర్పాట్లు మాత్రం భారీగా ఉన్నాయి.

28న విట్‌లో నూతన భవన ప్రారంభోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశం కల్పించిన విషయం తెలిసిందే.

రాయపూడి ప్రైమరీ స్కూలుకు విట్ వితరణ

రాయపూడి : తుళ్ళూరు మండలంలోని రాయపూడి పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఐనవోలు విట్ కళాశాల యజమాన్యం 30 బెంచీలను సమకూర్చింది. రాజధానిలో విట్ కళాశాల ఏర్పాటుకు రైతులు ప్రభుత్వానికి భూములు ఇచ్చిన నేపథ్యంలో వారు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు దడంగి సుబ్బారావు, ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు విట్ కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్‌కళాశాల పీడీ కాళిదాసు, సెక్రటరీ కొండలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జపాన్ టమోటాల ఉత్పత్తి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు వెల్లడిస్తున్నారు. గతేడాది లక్ష్మీ పొలంలో 100 మొక్కలు నాటగా, ప్రస్తుతం అవి 5 మీటర్ల ఎత్తు పెరిగాయని మరో 36 నెలల్లో ఏపీ ఆపిల్ దిగుబడి వస్తుందని వివరించారు. ఎంపిక చేసిన 10 మంది రైతులకు 2016లో రూ. 4లక్షలు రుణాలు మంజూరు చేసి 1000 ఆపిల్ మొక్కలను అందచేశామని హార్టీకల్చర్ అధికారి బి. శ్రీనివాసులు తెలిపారు. అందచేసిన ఆపిల్ మొక్కల్లో అన్నా, దర్సెట్, గోల్డెన్, స్కార్‌లెట్ రకాలు ఉన్నాయన్నారు. ఉద్యానవన పంటలను ప్రోత్సహించే దిశలో జీడిమామిడి, మామిడి పంటలకు ప్రాధాన్యత నిస్తూ రూ.5 లక్షల రుణాలను రైతులక అందించామని ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు. ట్రికోర్ పథకంతో మొక్కలు నాటి, సంరక్షించే కార్యక్రమంలో కుటుంబసభ్యులంతా పాలుపంచుకుంటున్నామని కుట్రవాడకు చెందిన లింగారెడ్డి సరళ, లోతా రాములమ్మలు తెలిపారు. మండలంలోని మిగతా రైతులు కూడా ఆపిల్ సాగుపై ఆసక్తి చూపుతూ హార్టికల్చర్ అధికారులను సంప్రదిస్తున్నారు.

కాశ్మీర్ తల్లుల కన్నీటి వేడుకోలు

ఆమె

రక్త రాజకీయ క్రీడలో యువకులు బలవుతుంటే..తల్లులకు తీరని గర్భశోకాన్ని భరించాల్సి వస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు గడచినా భారతదేశానికి కిరీటం లాంటి కాశ్మీర్‌లో మాత్రం రోజురోజుకు పరిస్థితులు దిగజారుతూనే ఉన్నాయి. ఒకవైపు ఉగ్రవాదులు, మరొక వైపు భద్రతాదళాలు మధ్యలో యువకులు .. ఏరోజు ఏమవుతుందో తెలియని పరిస్థితుల మధ్య తల్లులు పడే తపన, వర్ణించలేని వేదనకు ప్రతిరూపమే ఫుట్‌బాల్ గోల్‌కీపర్ మజిద్ అర్షన్ ఖాన్ తల్లి కన్నీటి వేడుకోలు..

నువ్వులేకుండా మేము బ్రతకలేం.. ఇంటికి వచ్చెయ్

20 ఏళ్ల మజిద్ చదువుల్లోనూ ఆటల్లోనూ ముందుండే వాడు. ప్రస్తుతం రెండో సంవత్సరం కామర్స్ డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 7న ఇంటినుంచి మాయం అయిన మజిద్ ఉగ్రవాద సంస్థ లష్కరీ తోయిబాలో చేరిపోయానని ఏకే 47పట్టుకొని ఉన్న మజిద్ ఫోటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. చేతికందిన కొడుకు ఉగ్రవాదుల్లో కలిసిపోయాడన్న వార్త తెలిసిన తండ్రి ఇర్షాద్ అహ్మద్ ఖాన్ గుండెపోటుకు గురయ్యాడు. తల్లి తిండితిప్పలు మానేసి గుండెలు పగిలేలా ఏడుస్తూనే ఉంది. **నువ్వులేకుండా మేము బ్రతకలేం.. ఇంటికి వచ్చెయ్ అంటూ తల్లి అషియాబేగం (50) కన్నీటితో వేడుకోవడాన్ని మాధ్యమాలు ప్రసారం చేయడంతో గత గురువారం తిరిగి ఇంటికి వచ్చాడు.** పోలీసులు అతనిపై కేసు నమోదు చేయలేదు. అలాగే మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు బైచుంగ్ భుటియా అతనిని జమ్ముకాశ్మీర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ చేర్చుకోవాలని వారికి ట్వీట్ చేశారు. స్నేహితుడు భద్రతాదళాల కాల్పుల్లో మరణించడంతో మిలిటెంట్లలోకి చేరాడని అతని స్నేహితులు చెబుతున్నారు.

ఈనెల 9న ఆషిక్ హుస్సేన్ భట్ కూడా మిలిటెంట్లలో చేరిపోయాడు. నీ భార్య మూడోనెల గర్భవతి, **నువ్వు తప్ప మాకెవ్వరూ లేరంటూ తల్లి పెహ్మీద్ , తండ్రి మహ్మద్ ఇషాక్ చేసిన కన్నీటి వేడుకోలు అతని గుండెలు కరిగిస్తుందో లేదో..** మంజూర్ అహ్మద్ బాబా (20) పళ్లవ్యాపారి కొడుకు మిలిటెంట్లలో చేరాడు. అతని **తల్లి నాకొడుకును విడిచి పెట్టమంటూ దూరదర్శన్‌లో ఉగ్రవాదులను కన్నీటితో వేడుకుంటోంది.**

ముస్లింలను ప్రభుత్వం అణచివేస్తోందని వారిని దేశపు పౌరులుగా చూడటంలేదని, వారిపై జరిగిన నేరాలు,ఘోరాలను వినిపిస్తూ ఉగ్రవాదులు యువతను దారిమళ్లిస్తుంటే, ఏ ముస్లిం యువకుడిని చూసినా ఉగ్రవాదనే కోణంలోనే భద్రతాదళాలు ప్రశ్నిస్తూ అరెస్టు చేస్తుంటాయి. ఈనేపథ్యంలో పిల్లలు తమ కళ్లముందే ఉగ్రవాదుల్లో కలసిపోకుండా చూసుకోవడం తల్లిదండ్రులకు కత్తిమీద సాములా మారింది. భావితరాలకు మంచి భవిష్యత్తును, తల్లిదండ్రులకు భరోసా ఇవ్వలేని సమాజంలో మనం బ్రతుకుతున్నాం. క్షుద్ర రాజకీయ నాయకులు ఉన్నంత వరకు ఈ తల్లుల కన్నీళ్లకు విశ్రాంతి ఉండదు.

అసోం మంత్రి వ్యాఖ్యలపై దుమారం

గౌహతి : అసోం మంత్రి హిమంత బిస్వా శర్మ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఆరోగ్యశాఖ మంత్రి అయిన బిస్వా బుధవారం నూతన ఉపాధ్యయులకు నియామక పత్రాలను అందించే కార్యక్రమానికి హాజరై ప్రసంగిస్తూ గత జన్మలో చేసిన పాపాల మూలంగానే మనుషులు చనిపోవటానికి కూడా కర్మే కారణమంటూ చెప్పారు.

దీనిపై హేతు వాదులు, ప్రాతికేయుల ముఖ్యంగా కాంగ్రెస్ ముఖ్య నేతలు బిస్వాపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఆ వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలంటూ జర్నలిస్టు పల్లవి ఘోష్ డిమాండ్ చేయగా బిస్వా వేదాంద ధోరణిలో వివరణ ఇచ్చారు. 'పాపానికి, కర్మకు మధ్య చాలా తేడా ఉంది. అది గుర్తించండి రాజకీయాలు వస్తూపోతూ ఉంటాయ్. కానీ, భగవద్గీతలో ఏదైతే చెప్ప బడిందో అదే శాశ్వతం నేను దాన్నే పాటిస్తా'నని బిస్వా సమాధాన మిచ్చారు. తాను కేవలం ఉపాధ్యాయులకు ప్రేరణ కల్పించే ఉద్దేశంతోనే అలాంటి ఉపన్యాసం ఇచ్చానని, తాను చేసిన వ్యాఖ్యల్లో ఉలాంటి తప్పిదం లేదని ఆయన సమర్థించుకున్నారు. కాగా, ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత పి. చిదంబరం, కపిల్ సిబల్ ట్వీట్టర్‌లో మండిపడ్డారు. అయితే వారికి వరుస ట్వీట్లతో బిస్వాని చెప్పారు.

గుజరాత్ బీజేపీ సొంత జాగీరు కాదు

అహ్మదాబాద్ : గుజరాత్ బీజేపీ సొంత జాగీరేమీ కాదని పటీదార్ ఉద్యమ యువ నాయకుడు హార్దిక్ పటేల (24) విమర్శించారు. కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించినంత మాత్రాన ఆపార్టీకి తను తోకలా వ్యవహరించబోనన్నారు. అనుబంధ పార్టీ అన్న విమర్శల్లోనూ అర్థం లేదన్నారు. ప్రజలకు మాత్రమే తను అనుబంధ పార్టీగా వ్యవహరించగలనన్నారు... ఎన్నికల ప్రచార సభల్లో బిజీగా గడుపుతున్న హార్దిక్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అహ్మదాబాద్ విచ్చేయనున్నారన్నారు. అయితే రాహుల్‌ను తను వ్యక్తిగతంగా కలుసుకోవడం లేదన్నారు. ఆయనకు శుభాకాంక్షలు మాత్రం పంపుతానన్నారు. ఒకేవేదిక నుంచి ప్రచారం చేయబోవడం లేదన్నారు. గుజరాత్‌లో గత 22 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీకి బలమైన సామాజిక వర్గం పటీదార్లు లేదా పటేళ్లు గట్టి మద్దతుదారులుగా నిలిచారు. అయితే పటీదార్ రిజర్వేషన్ అంశంగా డిమాండ్ చేస్తున్న హార్దిక్ పటేల్ నాయకత్వంలో యువకులు ఈ దఫా బీజేపీని ఓడించాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్‌తో మితిమీరిన చెలిమి చేటు తెస్తుందంటూ పటీదార్లలోని పెద్దలు తరచూ హార్దిక్‌ను హెచ్చరిస్తూనే ఉండటం గమనార్హం. విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని హార్దిక్‌కు పలువురు సీనియర్లు హితవు చెబుతున్నారు.

దేశీయ ఐటీలకు పన్ను షాక్

200పైగా కంపెనీలకు నోటీసులు

ముంబై : అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టాలతో ఇప్పటికే తీవ్రంగా సతమతమవుతున్న ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలకు తాజాగా ఆదాయపు పన్ను శాఖ నుంచి పెద్ద షాక్ ఎదురైంది. సర్వీసు ట్యాక్స్ డిమాండ్ కింద 10 వేల కోట్ల రూపాయలు చెల్లించాలంటూ దేశీయ ఐటీ కంపెనీలను ఆదాయపు పన్ను శాఖ ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటికే ఆటోమేషన్ ముప్పు, కఠినతరమవుతున్న అమెరికా ఇమ్మిగేషన్ చట్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఐటీ కంపెనీలకు ఇది మరింత ప్రతికూలంగా మారింది. సర్వీసు ట్యాక్స్ కట్టాలంటూ ఇప్పటివరకు 200పైగా ఐటీ కంపెనీలకు సర్వీసు ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ నోటీసులు జారీచేసినట్టు తెలిసింది. గత ఐదేళ్లకు సంబంధించి ఎగుమతులపై వచ్చిన ప్రయోజనాలకు సర్వీస్ పన్ను కట్టాలని పేర్కొంది. అదనంగా 15 శాతం పన్నుతో పాటు జరిమానాలు కూడా కట్టాలంటూ ఆదేశించినట్టు సంబంధింత వర్గాలు చెప్పాయి. ఐటీ సంస్థలు ఎగుమతి ప్రయోజనాలకు అర్హులు కావని, కచ్చితంగా సేవాపన్ను చెల్లించాల్సిందేనని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. ఈ పన్ను డిమాండ్ ఐటీ కంపెనీలకు అతిపెద్ద షాకేనని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నారు. ఒకవేళ దీనిపై ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తే, పన్ను డిమాండ్‌లో 10 శాతం అక్కడ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. తమకు ఇది అతిపెద్ద సమస్య అని, రూ.175 కోట్ల పన్ను చెల్లించాలంటూ ఐటీ శాఖ నుంచి ఆదేశాలు జారీ అయినట్టు ఒక బహుళ జాతీయ కంపెనీ చెప్పింది.

ఏసీ, ఫ్రీజ్‌ల ధరలు తగ్గనున్నాయి

న్యూఢిల్లీ : రోజువారీ వినియోగం ఉన్న వస్తువులపై పన్నులను తగ్గిస్తూ ఇటీవల వస్తు- సేవల పన్ను (జీఎస్‌టీ) మండలి కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరికొన్ని వస్తువులపై కూడా జీఎస్‌టీ తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఏసీలు ఫ్రీజ్‌లు, వాషింగ్‌మిషన్లపై జీఎస్‌టీ తగ్గించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏసీలు,ఫ్రీజ్,లాంటి వస్తువులు 28 శాతం జీఎస్‌టీ అమలు చేస్తోంది. అయితే పన్నువెక్కువగా ఉండటం వల్ల వీటి విక్రయాలు తగ్గిపోయాయని ఇటీవల తయారీ సంస్థలు గగ్గోలు పెట్టడంతో వీటిపై జీఎస్‌టీని తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది. అంతేగాక ఇలాంటి వస్తువులపై జీఎస్‌టీ తగ్గించడంతో మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేరు చెప్పడానికి నిరాకరించిన ఓ సీనియర్ అధికారి అన్నారు. ఈ కారణాలతోనే ఇటీవల ఏసీ రెస్టారెంట్లపై ఉన్న జీఎస్‌టీని కూడా తగ్గించామన్నారు. ఇటీవల 28 శాతం శ్లాబులో ఉన్న 178 వస్తువులపై జీఎస్‌టీని తగ్గించిన విషయం తెలిసిందే షాంపూలు, వాషింగ్ పౌడర్ డిటర్జెంట్, ఫేషియల, మేకప్, చాక్‌లెట్లు వెట్ గ్రైండర్లు, బ్యాటరీలు, చేతివాచీలు తదితర వాటిపై జీఎస్‌టీని 18 శాతానికి తగ్గించారు. ప్రస్తుతం 28 శాతం శ్లాబులో 50 వస్తువులు మాత్రమే ఉన్నాయి.

15 రోజుల చికిత్సకు రూ.18 లక్షల బిల్లు

చర్యలు తీసుకుంటాం : జేపీ నడ్డా

గురుగావ్ : దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేసిన పాలకులు ప్రైవేటు ఆసుపత్రులకు కొమ్ముకాస్తున్నారు. వారి ధనదాహానికి అడ్డుఅదుపు లేకుండా పోతోంది. అందుకు ఉదాహరణగా డెంగీతో మృతిచెందిన ఏడేళ్ల బాలిక తండ్రి గురుగావ్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రి నిర్వాకాన్ని కళ్ల ముందుంచారు. ఆద్యాసింగ్ 15 రోజుల ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నందుకు ఖరీదైన మందులతోపాటు 660 సిరెంజిలు, 2,700 గ్లౌజులు వాడామని 20 పేజీల్లో రూ. 18 లక్షల బిల్లు పంపారు. దీంతో కుటుంబంతోపాటు ప్రజలు కూడా నివ్వెరపోతున్నారు. కుటుంబ స్నేహితుడు దీనిపై ట్వీట్ చేయగా తక్షణమే చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా విచారణకు ఆదేశించారు. అద్యాసింగ్ డెంగీ బారిన పడిందని గుర్తించగానే డాక్టర్లు ఆమెను ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు రిఫర్ చేశారు. ఆగస్టు 31 నాటికి ఆమె ఆరోగ్యపరిస్థితి క్షిణించింది. దాంతో మరుసటి రోజు పాపను వెంటిలేటర్‌పై ఉంచారు. ఆమెను వెంటిలేటర్‌పై ఉంచడమే కాకుండా 15 రోజుల పాటు డయాలసిస్‌కూడా నిర్వహించారు. నాలుగురోజుల పాటు సెలైన్లు ఎక్కించారు. నాలుగురోజుల తర్వాత ఆమెకు మెదడు దెబ్బతిందని డాక్టర్లు తెలిపారు. అయితే సీటి/ ఎంఆర్ఐ స్కాన్‌లేవీ తీయకుండానే చికిత్సను కొనసాగించారు. రక్తంలోని ప్లేట్‌లెట్ల శాతం గణనీయంగా తగ్గిందని, రక్తంలోని ప్లాస్మా మార్నిడి జరపాలన్నారు. అన్ని స్థాయిల్లో చికిత్స అందించామని పాపలో కోలుకునే శక్తి తక్కువగా ఉందని ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. ఆమె మృతిచెందిన తర్వాత కూడా పాప ఆరోగ్యం కోసం డాక్టర్లు ఎంతగానో శ్రమించారని భావించామని ఆమె తండ్రి, ఐటీ వృత్తిదారుడు జయంత్ తెలిపారు.

డిసెంబరులోనే పార్లమెంటు

అనంతకుమార్ ప్రకటన

న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరులో నిర్వహిస్తామని, త్వరలోనే తేదీలు ప్రకటిస్తామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ చెప్పారు. యూపీఏ హయాంలోనూ డిసెంబరులో జరిగిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. శీతాకాల సమావేశాల జాప్యంపై కాంగ్రెస్ ఆరోపణలను ఆయన తిరస్కరించారు. శీతాకాల సమావేశాలను నిర్వహించకపోవడంపై కాంగ్రెస్ ముప్పేట దాడికి దిగిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం స్పందించింది. ప్రతిపక్ష పార్టీ జ్ఞాపకశక్తిని కోల్పోయిందని ఎదురుదాడికి దిగారు. 2008,2013లో డిసెంబరులోనే శీతాకాలం సమావేశాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. సాధారణంగా పార్లమెంటు సమావేశాలు, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని అన్నారు. గతంలోనూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్లమెంట్ సమావేశాల నిర్వహణలో జాప్యం జరిగిందని చెప్పారు.

'పద్మావతి' కి బ్రిటీష్ సెన్సార్ క్లీన్ చిట్

భారత సెన్సార్ ఆమోదిస్తే విడుదల : నిర్మాతలు

లండన్ : దీపికా పడుకొనే కథానాయకగా నటించిన వివాదాస్పద 'పద్మావతి' చలన చిత్రానికి ఎట్టి కత్తిరింపులు లేకుండానే బ్రిటిష్ సెన్సార్ బోర్డు క్లీన్‌చిట్ మంజూరు చేసింది. ఇదే తరహాలో భారత సీబీఎఫ్‌సీ కూడా ఆమోదించాలని సదరు చిత్ర నిర్మాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. రణవీర్‌సింగ్, షాహిద్ కపూర్‌లు ఇతర పాత్రల్లో నటించారు. భారతీయ సెన్సార్ బోర్డు నుంచి ఆమోదం లభించకుండా చలనచిత్రాన్ని విడుదల చేయాలనే ఆలోచన తమకు లేదని చెబుతున్నారు. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలాభన్సాలీ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి 12 ఏ రేటింగ్‌ను ఇస్తూ బీబీఎఫ్‌సీ సర్టిఫికేట్‌ను జారీ చేసింది.ఎలాంటి కత్తిరింపులూ లేకుండానే చిత్ర ప్రదర్శనకు అనుమతించింది.ఈ రేటింగ్ పొందిన చిత్రాన్ని చేసేందుకు తోడుగా పెద్దలెవరూ లేకుండా 12 సంవత్సరాలోపు బాలలను అనుమతించరు. కాగా, డిసెంబరు 1న భారత్‌కు వెలుపల చలనచిత్రాన్ని విడుదల చేయనీయరాదని నిర్మాతలను ఆదేశించాల్సిందిగా కోరుతూ దాఖలైన పిటిషను విచారణను 28 (మంగళవారం) న చేపెట్టేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖనిల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం సుముఖత వ్యక్తం చేసింది. సెన్సార్ బోర్డు అనుమతి కోసం చలనచిత్రంలోని అంశాలను తారుమారు చేసి చూపారంటూ నిర్మాతలపై పిటిషనరు అభియోగం మోపారు. సినిమాలోని పాటలు, ప్రచారం చిత్రం విడుదల చేసుకునేందుకు నిర్మాతలు ఇలా వ్యవహరించినట్లు పిటిషన్లో ఆరోపించారు. వయాకామ్.18, భన్సాలీ ప్రొడక్షన్స్‌ల సంయుక్త భాగస్వామ్యంలో పద్మావతి రూపొందింది 50 దేశాల్లో విడుదలకు మార్గం సుగమమైందని, భారత్‌లో విడుదలకు అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని సంబంధిత వర్గాలు తెలిపాయి. పద్మావతి సినిమాలో చరిత్రను వక్రీకరించి చూపారంటూ రాజ్‌పుట్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. సినిమాను విడుదల కానీయమనీ, కథానాయిక దీపిక, దర్శకుడు భన్సాలీల తలలకు కొందరు అతివాదులు వెలలు కట్టిన పరిస్థితి ఉద్రిక్తతకు తెరలేపింది. అయితే, రాజ్‌పుట్‌లు ఆరోపిస్తున్నట్లుగా తన సినిమాలో ఎలాంటి కల్పితాలు చోటివ్వలేదని భన్సాలీ చేస్తున్న విజ్ఞప్తి ఉద్రిక్తతను సడలించలేకపోయింది.

కొండెక్కిన కోడి గుడ్లు

ఉత్పిత్తి తగ్గడమే కారణం

న్యూఢిల్లీ : కోడిగుడ్ల ధరలు కొండెక్కాయి ప్రస్తుతం మార్కెట్‌లో రిటైల్ ధర రూ. 7లుగా ఉంది. ప్రజలు చికెన్ తినడానికి బదులుగా కోడి గుడ్డు తినడమే మరింత భారం కావచ్చు. బాయిలర్ కోడి మాదిరిగా కోడిగుడ్ల ఉత్పిత్తి వేగంగా రావడం లేదు. దేశంలోని చాలా ప్రాంతాలలో గత కొన్ని రోజులుగా రిటైల్ మార్కెట్‌లో కోడిగుడ్లు ఒకటి రూ. 5 నుంచి రూ.7-7.50లుగా ధర 40 శాతం మేర పెరిగిందని పౌల్ట్రీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రమేష్ కత్రి తెలిపారు. ' గత ఏడాది మంచి ధరలు లేకపోవడం, ఈ ఏడాది ఉత్పిత్తి తగ్గడంతో అనేక పౌల్ట్రీ ఫాలంలో కోడిగుడ్ల ధరలు గణనీయంగా పెరిగాయి' అని కత్రి వివరించారు. ఈ ఏడాది 25-30 శాతం తక్కువగా కోడిగుడ్ల ఉత్పిత్త తగ్గవచ్చు. రానున్న నెలల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఆయన అన్నారు. 2016-17లో దేశీయ ఉత్పిత్తిలో కోడిగుడ్డు ఉత్పిత్తి వ్యయం రూ. 3.50గా ఉందని కత్రి వివరించారు. గత ఏడాది నష్టాలు చవిచూడటంతో మరోసారి ధరలు ఉండవేమోనన్న ఆందోళన అలాగే జంతు సంక్షేమ కార్యకర్తల బయంతో అనేక మంది పౌల్ట్రీ యజమానులు తమ ఉత్పిత్తిని తగ్గించేశారు. చాలా పౌల్ట్రీలు మూతపడ్డాయి అని పేర్కొన్నారు.

ఇకపై చెక్‌బుక్‌ల నిషేధం

డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం

న్యూఢిల్లీ : చెక్‌బుక్ నిషేధించడంపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గురిపెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దేశంలో పెద్దనోట్ల రద్దు కార్మికుల నుండి పారిశ్రామిక వేత్తల వరకు ఇరకాటంలో పడేసింది. ముఖ్యంగా పెద్దనోట్ల రద్దు ప్రక్రియతో సామాన్యులు పడిన అగచాట్లు మరిచిపోకుండానే ప్రభుత్వం చెక్‌బుక్‌ల రద్దుకు మరో సంచలన నిర్ణయానికి తెరతీస్తోంది. దేశంలో 95 శాతం లావాదేవీలు నగదు లేదా చెక్‌ల రూపంలోగానీ జరుగుతున్నాయి. పెద్ద నోట్ల రద్దు అనంతరం నగదు లావాదేవీల శాతం తగ్గిపోయి చెక్‌లు పెద్ద పాత్ర వహిస్తున్నాయి. డిజిటల్ లావాదేవీలు శాతం మిశ్రమంగా ఉన్నాయి. డిబిట్, క్రెడిట్ కార్డులను మరింత ప్రోత్సహించేరీతిలో ప్రభుత్వం నిర్ణయంతీసుకున్నట్లు ప్రఖ్యాత ట్రేడ్ సంస్థకు చెందిన సీనియర్ అధికారి పేర్కొన్నారు. అంతేకాకుండా డెబిట్ ద్వారా చెల్లింపులకు 1 శాతం , క్రెడిట్ కార్డులు ద్వారా చెల్లింపులకు 2 శాతం చార్జీలను బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం నేరుగా బ్యాంకులకు సబ్సిడీ ఇవ్వడం ద్వారా ఈ ప్రక్రియను మరింత ప్రోత్సహించవలసి ఉంది.

తండ్రుల అధికారం కుమారులకు వరం

బిజినెస్

దీపం ఉండగానే చక్కపెట్టుకోవాలన్నది ఒకప్పటి సామెత.. తండ్రులు అధికారంలో ఉండగానే సుపుత్రులు సంపాదించుకోవాలన్నది నేటి సామెత. ప్రధానిగా మోడీ పదవిచేపట్టిన ఏడాదిలోనే భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జైషా కంపెనీ ఆదాయం 16 వేల రెట్లు పెరిగింది. అంటే రూ.50 వేల నుంచి రూ. 8 వేల కోట్లకు చేరుకుంది. జైషా స్టాక్ ఎక్సేంజ్ ట్రేడింగ్ జరిపే ఆయన గాలిమరలతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి పీయూసీలో లోన్ తీసుకోవడంలో ఆయన దశ తిరిగిపోయింది.



ఈ విషయాలను బయటపెట్టిన 'దివైర్' ఆంగ్ల వెబ్‌సైట్‌కు షా లాయర్ హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాద దేశంగా పాకిస్తాన్‌ను గుర్తించాలని బీజేపీ ప్రభుత్వం కాలికి బలపం కట్టుకొని ప్రపంచదేశాలకు తిరుగుతున్నా వారితో వ్యాపారాల విషయంలో మాత్రం చాల పెద్దమనస్సుతో వ్యవహరిస్తోంది. జాతీయ భద్రతా సలహాదారు, ప్రధాని మోడీ నమ్మిన బంటు అయిన అజిత్‌దోవల్ కుమారుడు శౌర్య దోవల్ వ్యవహారాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు ఆశిష్ ఖేతన్ ఇటీవలే బయటపెట్టారు. ఆప్ నేత ఆరోపణల ప్రకారం ప్రధాని మోడీ వెంట నిరంతరం నీడలా ఉండే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కుమారుడు పాకిస్తాన్ జాతీయుడితో ఎంచక్కా వ్యాపారం నిర్వహించుకుంటున్నాడు. ఈ కంపెనీ పేరు జెమినీ ఫైనాన్షియల్ సర్వీసెస్. ఈ కంపెనీలో శౌర్య దోవల్‌కు పాకిస్తాన్ దేశీయుడైన సయ్యద్ అలీ అబ్బాస్, సౌదీ యువరాజు మిషాల్ బిన్ అబ్దుల్లా బిన్ తుర్కీ భాగస్వాములు. భారత్ లో థింక్ ట్యాంక్ (మేథావి వర్గం)అనే మరో సంస్థను కూడా శౌర్య దోవల్ నడుపుతున్నాడు. ఈ సంస్థలో నలుగురు కేంద్ర మంత్రులు డైరెక్టర్స్‌గా ఉన్నారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ డైరెక్టర్లలో ఒకరు. ఈ సంస్థకు సహ వ్యవస్థాపకుడు బీజేపీ జనరల్ సెక్రటరీ రామ్ మాధవ్. బీజేపీ ప్రభుత్వంపై ఏమాత్రం విమర్శలు చేసినా దేశభక్తి లేనివాళ్లు పాకిస్థాన్‌కు వెళ్లండి అంటూ విరుచుకు పడే హిందూ శక్తులు దీనిపై నోరుమెదపరు.ప్రధాని కార్యాలయం, ఆర్ఎస్ఎస్ మాత్రమే వారితో వ్యాపార సంబంధాలు పెట్టుకోవచ్చా..అని వామపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

నిజానికి జాతీయ భద్రతా సలహాదారుల పిల్లలు,దగ్గరి బంధువులు విదేశాల్లో ఉండరాదనే నియమాన్ని కేంద్రప్రభుత్వం ఉల్లంఘించి ఆయాదేశాలవారితో అత్యున్నత అధికారి కుటుంబసభ్యులు వ్యాపారలావాదేవీలు జరపడం ఇంతకు ముందెన్నడూ లేదు.

మరొకరు వెంకయ్యనాయుడు కుమారుడు హైదరాబాద్ బంజారా హిల్స్‌లో ఉన్న హర్షటయోటాతో ఎన్నో లాభాలు గడించారు. తెలంగాణ ప్రభుత్వం పోలీసులకు నూతన వాహనాలు ఈ సంస్థనుంచే కొనుగోలు చేసింది. ఇంక కూతురు దీపా వెంకట్ నెలకొల్పిన స్వర్ణభారతి ట్రస్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతికి ఎముక లేకుండా భూములు కట్టబెట్టారని వామపక్షాలు విమర్శించి..విమర్శించి విసిగి పోయాయి.

కాలమ్

ప్రధాని మంత్రికి కటింగ్ చేస్తూ..
బార్బర్ అడిగాడు....
సార్ ...! ఆ స్విస్ బ్యాంక్ వ్యవహారం ఏమైంది? అని అడిగాడు.
దానికి మోదీ ఆ బార్బర్‌పై విరుచుకుపడ్డారు.
నువ్వు వెంట్రుకలు కటింగ్ చేస్తున్నావా?
విచారణ చేస్తున్నావా అని!
రెండో రోజు మన ఆర్థిక మంత్రి జైట్లీకి కటింగ్ చేస్తూ..
బార్బర్ అడిగాడు...
సార్! ఆ నల్లధనం విషయం ఏమైందీ? అని
వెంటనే జైట్లీ నువ్వు బార్బర్‌వా, సి.బి.ఐ ఆఫీసర్‌వా? అని కొట్టేంత పనిచేశారు.
మూడో రోజు సి.బి.ఐ అధికారులు బార్బర్‌ను ఇంటరాగేట్ చేస్తూ...
నువ్వు పాక్ ఏజెంటువా? అన్నా హజారే మనిషివా? అసలు నల్లధనం, స్విస్ బ్యాంకుల గురించి ఎందుకు మాట్లాడుతున్నావు అంటూ ప్రశ్నించారు....
దానికి ఆ బార్బర్ సారీ సర్.. అవేవీ నాకు తెలీదు.. ఆమాట ఎత్తినప్పుడల్లా వారి వెంట్రుకలు నిక్కబొడుచుకుంటున్నాయి. కటింగ్ చేయడం ఈజీ అవుతోంది అన్నాడు...

.....

బ్రాహ్మణులను....శాస్త్రిగారు అనాలి
రాజుని.....రాజుగారూ అనాలి
వైశ్యులను..... సావకారుగారు అనాలి
కమ్మవారిని..... చౌదరిగారు అనాలి
రెడ్డిలను..... రెడ్డీ గారు అనాలి
అయితే
కాపులను..... కాపోడు.. అంటారు.
మంగలివారిని.... మంగలోడ అంటారు.
గౌడ, కుర్మోల్లను .... గొల్లోడ అంటారు.
పద్మాశాలిని .... సాలోడ అని అంటారు.
మాలలనీ... ఒరేయ్..మాలోడా.. అంటారు.
మాదిగలనీ... ఒరేయ్...మాదిగోడా... అంటారు.
ఎరుకలనీ... ఒరేయ్... ఎరుకలోడా... అంటారు.
ఇదే సనాతనధర్మ.... హిందూమతం .. యొక్క గొప్పతనం.
ఇప్పుడు చెప్పండి హిందువుగా గర్వించు అని.
ఈ రోజు దేశాన్ని ప్రగతి పథంలో, అభివృద్ధి వైపు నడిపే ప్రధానమైన శాఖల్లో, దేశ ప్రజలు పై అధికారం కలిగి ఉన్న శాఖల్లో ప్రధానంగా ఉన్నది ఎవరో వారే ఈ రోజు భారత దేశం వెనుకబాటుకు,ఈ రోజు దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులకు కారణం అవుతున్నారు.

- భారత దేశంలో లోక్‌సభలో-48% బ్రాహ్మణులు.
- భారత రాజ్యసభలో-36% బ్రాహ్మణులు
- గవర్నర్లు -50% బ్రాహ్మణులు
- భారత ప్రభుత్వం క్యాబినెట్ మంత్రులు 33% బ్రాహ్మణులు
- భారత ప్రభుత్వ మంత్రులు -54% బ్రాహ్మణులు
- భారత ప్రభుత్వ కార్యదర్శులు -62% బ్రాహ్మణులు
- పర్సనల్ కార్యదర్శులు -70 % బ్రాహ్మణులు
- యూనివర్సిటి వైస్ ఛాన్సలర్‌లు -51% బ్రాహ్మణులు
- సుప్రీమ్ కోర్టు జడ్జీలు -56% బ్రాహ్మణులు
- హైకోర్టు జడ్జిలు -40%బ్రాహ్మణులు
- భారత రాయబారులు-41% బ్రాహ్మణులు.
- బ్యాంకులలో -57% బ్రాహ్మణులు
- ఎయిర్‌లైన్స్‌లో -61 % బ్రాహ్మణులు
- ఐ.ఎ.ఎస్‌లు.- 72% బ్రాహ్మణులు
- ఐ.పి.ఎస్.లు-61%బ్రాహ్మణులు
- సి.బి.ఐ./కస్టమ్స్‌లో -72 % బ్రాహ్మణులు

టి.వి / బాలీవుడ్‌లో-83% బ్రాహ్మణులు
పబ్లిక్ అండర్ టెకింగ్ సంస్థల్లో..
కేంద్రంలో -57%

121 కోట్ల భారత దేశ జనాభాలో బ్రాహ్మణులు కేవలం 3% మాత్రమే ..

ప్రభుత్వ ఆసుపత్రులు వెలవెల

ఏమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : కార్పొరేట్ వైద్యశాలలు ధూంధాంగా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులు వెలవెలబోతున్నాయని ఏమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్‌ల

మామ అగ్గిరాజేస్తే...

అల్లుడు ఆజ్యం పోసాడు..

సినిమా

తమిళ హీరోలు సినిమాల్లో నటిస్తారు
అన్యాయం పై ప్రశ్నిస్తారు
తెలుగు హీరోలు అవార్డులు కోసం రాయబారాలు,
అవార్డ్ రాలేదంటే ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతారు

రాష్ట్రంలో నందుల గోల ఇప్పుడే తగ్గేలాలేదు. బాలకృష్ణ హీరోగా నటించిన 'లెజెండ్' కు సెన్సార్‌బోర్డు 'ఏ' కేటగిరి (పెద్దలకు మాత్రమే) కేటాయించిన సినిమాకు 9 నంది అవార్డులు ప్రకటించారని పరిశ్రమ గగ్గోలుపెడుతుంటే పంచాయతీరాజ్ శాఖమంత్రి లోకేష్ ప్రాంతీయ బేదాలు తలెత్తే వ్యాఖ్యలతో మరింత ఆజ్యం పోసినట్లయింది. జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన ఫలితాల సీల్డు కవర్లను మళ్లీ వెనక్కు తీసుకెళ్లి బాలకృష్ణ ఫలితాలు మార్చారంటూ మీడియాకు లీకులందాయి. నంది అవార్డులను ప్రకటించిన వారికి అస్కార్ అవార్డులు ఇవ్వాలని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చేసిన వ్యాఖ్యలపై జ్యూరీ సభ్యుడు మద్దినేని రమేష్ చేసిన కామెంట్లు కూడా అనేక విమర్శలకు గురయ్యాయి.

చంద్రబాబు ప్రభుత్వంపై రుద్రమదేవి దర్శకుడు గుణశేఖర్ తీవ్రంగా విమర్శలు సంధించారు. అందుకు కారణం తెలుగు రాణి రుద్రమదేవి సినిమాను అత్యంత వ్యయప్రయాసలకు ఓర్చి రూపొందించి, పన్నుమినహాయింపుకోసం అమరావతి, మంత్రుల చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయారు గాని ఫలితం దక్కలేదు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం పన్ను మినహాయింపు ఇచ్చింది.

అదేమంటే ఓరుగల్లు రాజ్యం తెలంగాణాలో ఉందని ఒక పిడివాదాన్ని ముందుకు తెచ్చారు. అయితే కాకతీయ సామ్రాజ్యం ఇప్పటి ఆరు రాష్ట్రాలకు విస్తరించిందన్న చరిత్ర తెలియకుండా నటి, జ్యూరీ సభ్యురాలు జీవిత ఆయనపై విమర్శలు కురిపించారు. శాతవాహనులది తెలంగాణలోని కోటిలింగాలు అయినా గౌతమీ పుత్ర శాతకర్ణి విషయంలో ఆ వాదన ముందుకు తీసుకురాలేదు సరికదా అప్పటికప్పుడు పన్నుమినహాయిస్తూ మంత్రిమండలి (బావగారి సినిమాకు నేనుంటే బావుండదని చంద్రబాబు హాజరు కాలేదు) నిమిషాల్లో ఆమోదం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం రెండు సినిమాలకు పన్ను మినహాయింపు నిచ్చింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విమర్శల పాలయింది. రుద్రమ దేవిలో యుద్ధసన్నివేశాలున్నాయి. అనేకమంది తారాగణం దానిలో పాలుపంచుకున్నారు. అయితే రాజమౌళి సలహాతో దర్శకుడు క్రిష్ గౌతమీపుత్ర శాతకర్ణిలో యుద్ధసన్నివేశాలను హిందీ సినిమా నుంచి తెచ్చుకుని సినిమా నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకున్నారు. దాదాపు800 ఏళ్ల క్రితం తెలుగునేలను పాలించిన రాణిని గుర్తించి, దానిని అవార్డుకు ఎంపిక చేస్తే తెలుగు మహిళలను గౌరవించినట్లయ్యేది. లెజెండ్‌లో ఒక భ్రూణహత్యలపై మాత్రమే చర్చించారు. భ్రూణహత్యలను నిరోధిస్తే రుద్రమదేవులు తయారవుతారని చెప్పటానికి బాగుండేది.కాని అలా జరగలేదు. చిరంజీవి, అల్లు అర్జున్‌కు వచ్చిన అవార్డులతో బన్నీ వాసు బహిరంగంగానే నానా రచ్చ చేశారు. నటుడు శివాజీ మిస్సమ్మ చిత్రానికి అప్పట్లో తనకు ప్రకటించిన అవార్డును కొందరి కారణంగా అందుకోలేకపోయాననగా, లేటెస్టుగా శేఖర కమ్ముల తనకు దక్కవలసిన అవార్డును అల్లు అరవింద్ మూలంగా కోల్పోయానని ప్రకటించారు.

ఇదంతా ఇలా ఉండగా మంత్రి లోకేష్ ఆధార్‌కార్డులు, ఓటరు కార్డులు ఇక్కడ లేనివారే హైదరాబాద్ నుంచి మాట్లాడుతున్నారనని విమర్శ చేయడంతో ఇంకా రచ్చరచ్చగా మారింది. నటుడు,రచయిత పోసాని మురళీ కృష్ణ దాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అసలు విజయవాడ రాపచ్చా ? రాకూడదా అని ప్రశ్నిస్తూ.. వద్దంటే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళ్లదగ్గరే పడి ఉంటానని, తెలుగు చిత్రపరిశ్రమ వారిని తెలుగు రొహింగ్యాలను చేశారని, పరిపరివిధాలుగా ఏపీ ప్రభుత్వాన్ని, మంత్రి లోకేష్‌ను ఉతికి ఆరవేశారు.పనిలో పనిగా ఒక అగ్రతెలుగుపత్రికాధిపతికి కూడా చురకలంటిస్తూ, నందిని ముట్టుకోనని, తిరిగి ఇచ్చివేస్తానని ఆయన భీషణ ప్రతిజ్ఞ చేశారు.

నిర్మాత బన్నీ వాసు మెగా కుంటుంబానికి అనుగుణంగా మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో సగం వాటా ఈ కుటుంబం నుంచే ఉందని అవార్డుల విషయంలో వారికి అన్యాయం జరిగిందనడంతో ప్రజలు తెలుగు హీరోలు నందులకోసం కొట్టుకు చస్తారుగాని ప్రజలకు ఉపయోగపడేదానికి కోసం అస్సలు ముందుకురారని వాపోతున్నారు. చిత్రపరిశ్రమకు చెందిన రెండు కుటుంబాల మధ్య హోరాహోరీగా విమర్శలు జరుగుతున్న సమయంలో ఆరెండు కుటుంబాల నుంచి వచ్చిన కూతురు, కోడలు అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ తమకున్న 'రక్త' సంబంధాన్ని బయట పెట్టుకుని విబేధాలు తారాస్థాయికి చేరకుండా నిరోధించగలిగారు. ఏడు నెలల క్రిందట విశాఖ వేదికగా టి.సుబ్బిరామిరెడ్డి అవార్డు జరిగిన కార్యక్రమంలో ఉత్తమ దర్శకుడిగా గుణశేఖర్‌కు సత్కారం చేయాల్సిన బాలకృష్ణ శాలువా విసిరికొట్టడం, దానితో గుణశేఖర్ కళ్లజోడు కింద పడుతుంటే ఆత్రుతగా పట్టుకోవడం ఈ సందర్భంగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మొత్తం మీద మామా, అల్లుళ్లు ఎక్కడ చేయిపెట్టినా రగడే...

- ఇమ్రాన్

అయోధ్యలో ఆలయం, లక్నోలో మసీదు

లక్నో : అయోధ్యవివాదాస్పద స్థలం వద్ద రామ మందిరం, లక్నోలో మసీదు నిర్మాణం జరపాలంటూ ఉత్తర ప్రదేశ్ షియా వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ వసీమ్ రిజ్వీ మాట్లాడుతూ వేర్వేరు భాగస్వాములతో చర్చించిన నేపథ్యంలో ఈ ప్రతిపాదనను సూచించామన్నారు. వేర్వేరు పార్టీలతో చర్చించిన తర్వాత అయోధ్యలో రామమందిరం లక్నోలో మసీదును నిర్మించాలని మేము ఒక ప్రతిపాదనను సిద్ధం చేశాం' అని ఆయన తెలిపారు. దేశంలో శాంతి, సోదరభావాన్ని పెంపొందించేందుకు ఇది ఒక పరిష్కారమవుతుందని అన్నారు. రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదానికి సంబంధించి ఒక పరిష్కారంతో అయోధ్యకు చెందిన కొంతమంది మహంతులతో రిజ్వీ డిసెంబరు 5వ తేదీకి ముందు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీర్ఘకాల వివాదంలో ఉమ్మడి ఒప్పందం కోసం అయోధ్యలో మహంత సురేష్ దాస్, మహంత్ ధర్మదాస్‌లతో సహా అనేక మంది మహంతలను రిజ్వీ ఇటీవల కలుసుకున్నారు. అంతకుముందు, అయోధ్యలో రామ మందిరం ముస్లిం ప్రాబల్య ప్రాంతంలో మసీదు నిర్మాణాలకు సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానానికి షియా వక్ఫ్ బోర్డు ప్రతిపాదన చేసింది. కాగా సమస్యను స్నేహపూర్వకంగా పరిష్కరించేందుకు అన్ని వర్గాలు అనేక ప్రయత్నాలు చేశాయి.

అయితే అవన్నీ విఫలమయ్యాయి. అంతకు ముందు కోర్టు వెలుపలే ఈ వివాదాన్ని పరిష్కరించు కోవడం మేలని సుప్రీంకోర్టు సూచించింది. ఇదిలా ఉండగా, మధ్యయుగకాలం నాటి నిర్మాణాన్ని కూల గొట్టిన ఘటన 25వ వార్షికోత్సవానికి ముందు డిసెంబరు 5 నుంచి ఈ వివాదంపై తుది విచారణను సుప్రీంకోర్టు చేపట్టనుంది. 1528లో మొఘల్ చక్రవర్తి బాబర్ బాబ్రీ మసీదును నిర్మించాడు. అయితే మసీదును కూల గొట్టిన ప్రాంతంలో వాస్తవానికి రామ మందిరం ఉందని హిందువులు పేర్కొంటున్నారు.

'బ్లూ వేల్' ప్రమాదంపై అవగాహన కలిగించండి

రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : బ్లూ వేల్ చాలెంజ్ వంటి గేమ్‌ల వల్ల కలిగే ప్రమాదకర పర్యవసానాలపై పాఠశాల విద్యార్థులలో అవగాహన కల్పించాల్సిందిగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టుమ నేడు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ ఏఎం ఖనిల్కర్, సజ్జిస్ డీవై చంద్ర చూడ్‌లతో కూడిన ధర్మాసనం పై విధంగా గేమ్‌లవల్ల కలిగే ప్రమాదకర పర్యవసనాల గురించి బడికి వెళ్లే విద్యార్థులలో అవగాహన కల్పిచాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల కార్యదర్శులను కోరాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ధర్మాసనం కోరింది. ఈ విధమైన గేమ్‌ల వల్ల కలిగే దుష్పరిమాణాలను దేశంలోని అన్ని పాఠశాలలకు తెలియజెప్పేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కూడా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖను ధర్మాసనం కోరింది. కొన్ని రాష్ట్రాలలో విద్యార్థులు బ్లూ వేల్ ఛాలెంజ్ ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడడంపై విచారణకు కేంద్రం నియమించిన కమిటీ మధ్యంతర నివేదికను కూడా అత్యున్నత న్యాయస్థానం పరిశీలించింది.

బ్లూ వేల్ చాలెంజ్, ఇతర ప్రాణాపాయకరమైన ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాస్తవిక డిజిటల్ గేమ్స్‌ని నియంత్రించి, పర్యవేక్షించేందుకు మార్గదర్శకాలను రూపొందించాలని కోరుతూ న్యాయవాది స్నేహ కలిత దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టి వేసింది. వర్చువల్ డేర్ గేమ్‌ల ప్రమాదాలను ప్రధానంగా పేర్కొంటూ పది నిమిషాల గల విద్యా ప్రదర్శనను తయారు చేయవలసిందిగా అకోబరు 27వ తేదీన దూరదర్శన్‌ను అత్యున్నత న్యాయస్థానం కోరింది. అవగాహన కలిగించే ఈ షోని కేవలం దూరదర్శన్‌లో మాత్రమే కాకుండా అన్ని ప్రైవేట్ ఛానళ్లలో కూడా ప్రైమ్ టైమ్‌లో ప్రసారం చేసే విధంగా చూడాలని కూడా సూచించింది. ఇప్పటికే అనేక మంది ఆత్మహత్యకు కారణమైందిగా భావిస్తున్న బ్లూ వేల్ ఛాలెంజ్ వంటి గేమ్‌లను నిషేధించేందుకు నిపుణుల కమీటీని ఏర్పాటు చేయాలని కూడా కోర్టు ప్రభుత్వాన్ని కోరింది.

అప్పుడు ఆహా...ఇప్పుడు ఫ్చ..

ప్రపంచ సుందరీమణులుగా తొంభైయవ శతకంలో కీర్తి పతాకాలు ఎగరేసిన ఐశ్వర్యరాయ్ (మిస్‌వరల్డ్ 1994) సుస్మితాసేన్ (మిస్ యూనివర్స్ 1994)లను చూసి మాధ్యమాలు ఎంతగానో సంబరపడ్డాయి. మన భారతీయులు ఎందులో తక్కువ అంటూ పుంఖాను పుంఖాలుగా వారిని కీర్తిస్తూ పత్రికలు ప్రచురించాయి.భూమిమీద దేవకన్యల్లా ప్రజలంతా వారిని అబ్బురంగా చూశారు. ఆపై వరుసగా దయానా హెడన్(1997), యుక్తాముఖి (1999), ప్రియాంక చోప్రా (2000)ల్లో ఈ కిరీటాలు సొంతం చేసుకున్నాక దేశవాసులకు అందాల భామలపై ఆసక్తి తగ్గిందనే చెప్పవచ్చు. అంతేకాదు వీరి ఎంపిక సమయంలో సమాజసేవపై జ్యూరీకి కన్నీరు వచ్చే జవాబులు చెబుతున్నా, తర్వాత వీరు చేసే పనులకు ఎక్కడా పొగడడం లేదన్నది కూడా ప్రజలు గమనించారు. అందాల రాణులుగా కిరీటం సాధించి బహుళ వ్యాపార సంస్థలకు మోడళ్లుగా చేసి దేశంలోకి ఇబ్బడి ముబ్బడిగా సౌదర్యసాధనాలకు ప్రవేశం కల్పిస్తున్నారని తెలిసిపోయింది. ఆపై వీరి గమ్యస్థానం కూడా సినిమాల్లోకే అని విజేతలంతా నిరూపించేశారు. దీంతో ప్రజల్లో అప్పుడున్న క్రేజ్ మాత్రం ఇప్పుడు లేదనే చెప్పవచ్చు.

గతవారం ప్రపంచ సుందరిగా ఎన్నికైన మానుషి ఛిల్లర్ విషయంలో అన్ని మాధ్యమాలు కవర్ చేసినప్పటికీ సుస్మిత, ఐశ్వర్యరాయ్‌కు ఇచ్చినంత ప్రచారం, ప్రధాన్యత మాత్రం కల్పించలేదన్నది స్పష్టం అవుతోంది. మానుషి వైద్యవిద్యార్థి, తండ్రి డా.మిత్రాబసు రక్షణ పరిశోధనా సంస్థలో విధులు నిర్వహిస్తుండగా, తల్లి డాక్టర్ నీలం ఛిల్లార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్,అండ్ అల్లైడ్ సైన్సెస్‌లో న్యూరో కెమిస్ట్రీ విభాగం హెడ్‌గా ఉన్నారు. చిన్నప్పటినుంచి ఛిల్లార్ ఆటపాటల్లో ముందుంది. ఆడపిల్లల శాతం అత్యంత తక్కువగా ఉన్న రాష్ట్రం నుంచి ఆమె అత్యున్నత వైద్యవిద్యకు, అందాల పోటీకి ఎగబాకడంలో ఆమె తల్లి పాత్ర ఉందని ఛిల్లర్ స్పష్టం చేశారు. ఉన్నత తరగతి కుటుంబంగా ఆమెకు సహాయ సహకారాలు అందించడంలో వారు ముందున్నారు. అందంగా మెరిసిపోవడానికి డైటీషియన్, ఆరోగ్యంగా కనపడటానికి యోగా, కూచిపూడి డాన్స్, ఫిట్‌నెస్ ట్రైనర్‌ను అమర్చడం వారికి అంతకష్టం కాదు. అయితే మెడిసిన్ చదువుతూ ఇన్ని కార్యక్రమాలను బ్యాలెన్స్ చేసుకోవడం మామూలు విషయం కాదన్నది నిజం. బ్యూటీ విత్ పర్పస్‌లో భాగంగా స్త్రీల ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. దీనికోసం 20 గ్రామాల్లో పర్యటించి 5 వేల మంది మహిళలకు చికిత్స అందించారామె. అదంతా కిరీటం దక్కించుకోకముందు సంగతి. ప్రపంచ వ్యాప్తంగా ఇంత పలుకుబడి,అవకాశాలు వచ్చిన తర్వాత ఆమె వ్యాపార లేదా సినిమాల్లోకి వెళ్లకుండా ఉండటం అరుదైన విషయంగా భావించాలి. అందునా ఛిల్లార్ నటనలో కూడా మెలుకువలు నేర్చుకున్న యువతి. బాలీవుడ్ ప్రవేశంపై విలేకరులు ఆమెను ప్రశ్నించినపుడు మాత్రం సినిమాలే తన అంతిమ లక్ష్యం కాదని స్పష్టం చేసింది. ఏది ఏమైనా మొదటి మిస్ వరల్డ్‌ను అందించిన రీటా ఫారియా (వైద్యురాలు)లా గుండెజబ్బుల డాక్టర్‌గా సేవలందిస్తారో.. లేదంటే బాలీవుడ్‌ని ఏలుతారో తెలియడానికి మరికొంత సమయం పడుతుంది.

- ఖాన్

ఇంటివాళ్లయిన జహీర్, భువీ

క్రీడలు

ముంబై : టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ ఇంటివాడయ్యాడు.

తన ప్రేయసి, బాలీవుడ్ నటి సాగరిక ఘట్గేమ జహీర్ వివాహం చేసుకున్నాడు. వీరు రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లి ఫోటోలను జహీర్ స్నేహితురాలు, స్పోర్ట్ ఫిట్‌నెస్ స్టూడియో మార్కెటింగ్ హెడ్ అంజనా శర్మ షేర్ చేశారు. నవంబర్ 27న ముంబైలోని తాజ్ మహల్ ప్యాలెస్ అండ్ టవర్‌లో వీరి వివాహం రిసెప్షన్ జరగనుంది. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ సెలబ్రెటిలతో పాటు, జహీర్‌ఖాన్ స్నేహితులు హాజరుకానున్నారు. వివాహ రిసెప్షన్‌కి సంబంధించిన ఆహ్వాన పత్రికను సాగరిక స్నేహితురాలు చక్ దే ఇండియాలో ఆమె సహనటి విద్యా మాల్వంకర్ షేర్ చేసింది.

లక్నో : టీమిండియా స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పెళ్లి తన స్నేహితురాలు నుపూర్ నాగర్‌లో మీరట్‌లో వైభవంగా జరిగింది. శ్రీలంకతో కోల్‌కత్తా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మొదటి టెస్టు స్క్వాడ్‌లో ఉన్న భువీనీ మేనేజ్‌మెంట్ రిలీజ్ చేసింది. 27 ఏళ్ల ఈ ఆటగాడు శ్రీలంకతో మిగిలిన ఆఖరి టెస్టుకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. వివాహం అనంతరం నూపూర్ సొంత ఊనైన బులంద్ షెహర్‌లో ఆదివారం రిసెప్షన్ జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా 30న మరో రిసెప్షన్ కూడా ఏర్పాటు చేశారు. ఆ సమయానికి టీమిండియా ఢిల్లీలో ఆడనున్న నేపథ్యంలో జట్టు సభ్యులంతా హాజరయ్యే అవకాశం ఉంది.

హైబీపీ తగ్గాలంటే..

వీటిని తీసుకోవాలి..!

ఆరోగ్యం

బీపీ ఎక్కువగా ఉండడం వల్ల మన శరీరానికి ఎంతటి నష్టం కలుగుతుందో అందరికీ తెలిసిందే. హార్ట్ ఎటాక్‌లకు అది దారి తీస్తుంది. గుండె జబ్బులను కలిగిస్తుంది. చివరిగా ప్రాణాలకే ముప్పు తెచ్చి పెడుతుంది. కనుక ఎవరికైనా బీపీ కంట్రోల్‌లో ఉండాల్సిందే. ఈ క్రమంలో బీపీ తగ్గాలంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

నిమ్మరసం: నిమ్మకాయల్లో సి విటమిన్ ఎక్కువగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ కూడా ఎక్కువే. ఇవి గుండెకు వెళ్లే రక్త నాళాలను మృదువుగా ఉండేలా చేస్తాయి. వాటిలో ఏవైనా పదార్థాలు ఆగిపోయి ఉంటే వాటిని తొలగించేందుకు దోహదపడుతాయి. అంతేకాదు, అధికంగా ఉన్న బీపీ కూడా నిమ్మరసం తాగితే వెంటనే తగ్గిపోతుంది. అందుకు ఏం చేయాలంటే ఒక కప్పు గోరు వెచ్చని నీటిలో సగం నిమ్మ ముక్కను పూర్తిగా పిండి అనంతరం ఆ నీటిని తాగాలి. దీంతో బీపీ డౌన్ అవుతుంది. దీన్ని నిత్యం ఉదయాన్నే పరగడుపున తాగుతుంటే బీపీ క్రమంగా అదుపులోకి వస్తుంది.

వెల్లుల్లి: గుండెకు సంబంధించిన వ్యాధులు రాకుండా చూడడంలో వెల్లుల్లి అమోఘంగా పనిచేస్తుంది. రక్తంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. కొవ్వు కరిగేలా చేస్తుంది. బీపీ నియంత్రణకూ ఉపయోగపడుతుంది. నిత్యం 1, 2 వెల్లుల్లి రేకులను బాగా నలిపి 15 నిమిషాలు ఆగాక పచ్చిగానే తినాలి. అలా తినలేని వారు వాటిని పాలతోనూ తీసుకోవచ్చు. లేదంటే ఏదైనా కూర వండాక దాంట్లో కలుపుకుని తినవచ్చు.

అరటిపండు: పొటాషియం అధికంగా ఉండడం వల్ల అరటిపండు బీపీని అదుపు చేయడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. బీపీ బాగా ఉంటే వెంటనే ఒక అరటిపండును తినాలి. దీంతో బీపీ అదుపులోకి వస్తుంది. అంతేకాదు, ఈ పండును నిత్యం ఆహారంతోపాటు తీసుకుంటుంటే బీపీ కూడా క్రమంగా తగ్గుతుంది.

ఆకుపచ్చని కూరగాయలు: పీచు పదార్థం, పొటాషియం, విటమిన్ సి, మెగ్నిషియం వంటి కీలక పోషకాలు ఆకుపచ్చని కూరగాయల్లో ఉంటాయి. ఇవి గుండెకు సంబంధించిన వ్యాధులు రాకుండా చూస్తాయి. బీపీని నియంత్రిస్తాయి. నిత్యం ఆకుపచ్చని కూరగాయలను ఆహారంలో భాగం చేసుకుంటే బీపీ క్రమంగా తగ్గిపోతుంది.

బీన్స్: పీచు పదార్థం, పొటాషియం, మెగ్నిషియం వంటి పోషకాలు బీన్స్‌లో ఉంటాయి. ఇవి హైబీపీని కంట్రోల్ చేసేందుకు ఉపయోగపడతాయి. బీన్స్‌ను తరచూ తీసుకుంటూ ఉంటే బీపీ తగ్గుతుంది.

కొబ్బరి నీళ్లు: హైబీపీ ఉన్నవారు తమ శరీరం డీహైడ్రేట్ కాకుండా చూసుకోవాలి. అందుకోసం వారు నిత్యం కనీసం 10 గ్లాసుల నీటినైనా తాగాలి. అయితే నీరు అందుబాటులో లేకపోతే కొబ్బరి నీళ్లు అందుకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తాయి. ఎందుకంటే పొటాషియం, మెగ్నిషియం, విటమిన్ సి వంటి పోషకాలు ఉన్నందున కొబ్బరి నీళ్లను తాగితే శరీరానికి నీరు అందడమే కాదు, హై బీపీ వెంటనే అదుపులోకి వస్తుంది.

పుచ్చకాయ విత్తనాలు: బీపీని నియంత్రించడంలో పుచ్చకాయ విత్తనాలు కూడా అద్భుతంగా పనిచేస్తాయి. పలువురు సైంటిస్టులు దీన్ని ప్రయోగాత్మకంగా నిరూపించారు కూడా. కొన్ని పుచ్చకాయ విత్తనాలను సేకరించి నీడలో ఎండబెట్టి పొడి చేయాలి. అనంతరం అంతే మొత్తంలో గసగసాలను తీసుకుని పొడి చేసుకోవాలి. ఈ రెండింటినీ బాగా కలిపి ఆ మిశ్రమాన్ని నిల్వ చేసుకోవాలి. దీన్ని ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు 1 టీస్పూన్ చొప్పున తీసుకుని నీటిలో కలిపి తాగాలి. దీంతో బీపీ అదుపులోకి వస్తుంది.

పళనికే రెండాకులు

శశికళ వర్గానికి ఝలక్

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళని స్వామి- పన్నీర్ సెల్వం వర్గాన్నే నిజమైన ఏఐఏడీఎంకేగా గుర్తిస్తూ ఎన్నికల చిహ్నం రెండాకుల గుర్తును వారికే కేటాయిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నిర్ణయం పట్ల పళని స్వామి హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఎన్నికల గుర్తు కోసం గట్టి పట్టుపట్టిన శశికళ వర్గానికి ఎన్నికల సంఘం ఝలక్ ఇచ్చినట్లయింది. జయలలిత మరణం తరువాత ఏఐఏడీఎంకేలో అధిపత్య పోరు తలెత్తిన సంగతి తెలిసిందే.శశికళ, పళనిస్వామిల నేతృత్వాల్లో పార్టీ రెండుగా చీలి పోయింది.శశికళ వర్గానికే చెందిన పళనిస్వామి ముఖ్యమంత్రిగా బాధ్యతలూ చేపట్టారు. తదనంతరం పన్నీర్ సెల్వంతో పళనిస్వామి చేతులు కలిపారు. శశికలను, ఆమె మేనల్లుడు దివకరన్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఎన్నికల గుర్తు రెండాకులను హస్త గతం చేసుకోటవడానికి ఎన్నికల సంఘం ఆమోదం అనివార్యం కావడంతో ఎన్నికల గుర్తును తమకే కేటాయించాలని కోరుతూ రెండు పక్షాలు తమ తమ వాదనలను ఎన్నికల సంఘానికి వినిపించాయి. ఎన్నికల గుర్తును తమకే కేటాయించేందుకుగాను ఎన్నికల సంఘ్రంలోని ఒక అధికారికి లంచం ఇచ్చి ప్రలోభపెట్టే ప్రయత్నంలో దినకరన్ పట్టుబడటంతో కథ అడ్డం తిరిగినట్లయింది. కేసులో తీర్పును గత కొంత కాలంగా నిలిపి వేస్తూ వచ్చిన ఎన్నికల సంఘం తాజాగా ఈగురువారం పళని స్వామి-పన్నీర్ సెల్వం వర్గానికే రెండాకుల ఎన్నికల చిహ్నాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిస్థితి మున్ముందు తమిళనాడులోని రాజకీయాలను ఏ విధంగా ప్రభావితం చేసేది కాలం గడిస్తే కానీ తెలియదు.

ఉత్తర భారతానికి భారీ భూకంప ముప్పు

ప్రకంపనల తీవ్రత 8గా ఉండే అవకాశం

న్యూఢిల్లీ : ఉత్తర భారతదేశానికి భారీ భూకంప ముప్పు పొంచి ఉన్నదని జాతీయ భూకంప కేంద్రం హెచ్చరించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన గర్వాల్ హిమాలయాలపై రిక్టర్ స్కేలుపై 8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించడం ద్వారా ఉత్తర భారత్‌కు విస్తృత నష్టాన్ని కలగజేస్తుందని జాతీయ భూకంప కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వినీత్ గెహ్లోట్ బుధవవారం తెలిపారు. గత 700 ఏళ్లలో ఈ ప్రాంతంలో ఎటువంటి భూప్రకంపనాలు నమోదు కాలేదు. కానీ ఈ ప్రాంతంలో సంభవించే స్వల్ప భూకంపాల వల్ల చిన్న మొత్తంలో శక్తిని విడుదలవుతుందని, ఒక భారీ కుదుపు కూడా చోటుచేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.' భవిష్యత్తులో ఉత్తరాఖండ్‌లో ఒక భారీ భూకంపం సంభవించే అవకాశం ఉందని గణాంకాలు సూచిస్తున్నాయి. అందుకూ కారణాలు ఉన్నాయి. గత 500 నుంచి 700 ఏళ్లలో పెద్ద భూకంపం ఏదీ చోటుచేసుకోలేదు. భారీ భూకంపాలు సంభవించిన అవసరమైన,శక్తి వందేళ్ల నాటి నుస్త్రంచి పొందుపరచబడుతుంది.' అని వినీత్ గెహ్లోట్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో భారీ నష్టం సంభవించవించవచ్చని ఆయన హెచ్చరించారు.భూకంపాల తీవ్రతను తగ్గించేందుకు సురక్షిత భవనాల నిర్మాణం, అందుకు తగిన ప్రణాళికలు అనుసరించడం వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గెహ్లోట్ పేర్కొన్నారు.

Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com